జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం




రంగారెడ్డి | సోమవారం 7 జూలై 2025 | సంపుటి : 15 | సంచిక : 263 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# పెరుగుతున్న సిజేరియన్లు



ప్రమాదంలో తల్లీబిడ్డల ఆరోగ్యం

రాష్ట్రంలో 53 శాతం దాటేసిన సిజేరియన్లు

ప్రభుత్వ వైద్యశాలల్లో 39.93 శాతం

ప్రైవేట్ ఆసుపత్రుల్లో 63.85 శాతం

అమ్మదనాన్ని ఆస్వాదించే తొలి అడుగు తడబడుతోంది

ముందే ఆసుపత్రిలో చేరి, నొప్పి బాధ తెలియకుండానే ప్రసవం చేయించుకునేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

లోకం చూసే ప్రతి బిడ్డ జననం వెనుక ఓ తల్లి ప్రసవవేదన ఉంటుంది. తన బిడ్డ గర్భం నుంచి బయటకు వచ్చి ఊపిరి పీల్చుకుంటే అప్పటివరకు పడిన బాధను మర్చిపోయి ఆ పసిగుడ్డును ఆప్యాయంగా హత్తుకుంటుంది. అమ్మదనానికి ఓ గుర్తింపుగా చెప్పుకొనే ఈ పురిటి నొప్పులు ఆ సమయంలో అరుపులు ఇప్పుడు వినిపించట్లేదు. ప్రస్తుతం తల్లికి నొప్పి తెలియకుండానే బిడ్డలు భూమ్మీదకు వస్తున్నారు. ఇందుకు కారణం పెరుగుతున్న సిజేరియన్ ప్రసవాలే. వైద్యరంగంలో పెరుగుతున్న వ్యాపార ధోరణితో రోజురోజుకు సిజేరియన్లు పెరుగుతున్నాయి. తర్వాత వచ్చే సమస్యలతో ఏకంగా గర్భసంచి తొలగింపు కేసులూ ఎక్కువవుతున్నాయి. అదేవిధంగా కొత్తగా వృత్తిలోకి - మిగతా3లో



## బిహార్ గూండాల రాజ్యంగా మారిపోయింది

- నేడు బిహార్ దోపిడీ, కాల్పులు, హత్యల నీడలో నివసిస్తోంది
- రాష్ట్రంలో నేరాలు జరగడమనేది సాధారణంగా మారిపోయింది
- వీటిని నిర్మూలించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



## రఫేల్ యుద్ధ విమానాలకు వ్యతిరేకంగా చైనా దుష్ప్రచారం..!

- ఫ్రెంచ్ ఇంటెలిజెన్స్ నివేదిక..!
- ఫ్రెంచ్ యుద్ధ విమానాల సామర్థ్యంపై సందేహాలను లేవనెత్తేందుకు ప్రయత్నిస్తోంది
- చైనా తమ యుద్ధ విమానాలు రఫేల్ కంటే మెరుగైన ప్రదర్శన చేసినట్లుగా డ్రాగన్ దేశం ప్రచారం



## హిమాచల్‌లో 75 మరణాలు..

- వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ విధింపు
- పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే ప్రమాదం
- హిమాచల్ ప్రదేశ్‌లో ఒక్క రోజులో 115-204 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది

# సీఎం చంద్రబాబు 10న కొత్తచెరువు పర్యటన



- రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయండి
- జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్‌లి, జిల్లా ఎస్పీ వి.రత్న
- ముఖ్యమంత్రి పర్యటనపై దిశానిర్దేశం

**పుట్టపర్తి**

శ్రీ సత్య సాయి జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 10వ తేదీన కొత్తచెరువులో పర్యటించే అవకాశం ఉంది. అయితే ఇంకా అధికారికంగా మినిట్ టు మినిట్ అందాల్సి ఉంది... ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లను ప్రణాళికా బద్ధంగా పూర్తి చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కొత్తచెరువు లోని శ్రీ సత్య సాయి ప్రభుత్వ జూనియర్ కాలేజి ఆవరణలో ఎస్పీ వి.రత్న, జేసి అభిషేక్ కుమార్..లతో కలసి అధికారులతో జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ సమావేశం నిర్వహించి ముఖ్యమంత్రి పర్యటనపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ..ఐరాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 10వ తేదీన కొత్తచెరువు జడ్పి బాలురు, బాలికల పాఠశాలలు, శ్రీ సత్య సాయి ప్రభుత్వ జూనియర్ కాలేజిలలో జరిగే మెగా పిటిఎం 2.0 కార్యక్రమంలో - మిగతా3లో



### 9న చిత్తూరు జిల్లాకు వైఎస్ జగన్..

## కూటమి సర్కార్‌లో అలజడి

- చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు కష్టాలు పడుతున్నారు
- రైతులను జ్యూస్ ఫ్యాక్టరీలు దోచుకుంటున్నాయి
- ఈ నెల 9న వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో ప్రభుత్వంలో కదలిక
- జ్యూస్ ఫ్యాక్టరీలు వద్ద క్యూలైన్‌లో టోకెన్లు ఇచ్చి తక్కువ ధరకే దోచుకుంటున్నాయి
- చాలా చోట్ల 3 నుంచి 4 రూపాయలకే జ్యూస్ ఫ్యాక్టరీలు దోచుకుంటున్నాయి.

## చంద్రబాబు పాలన చూసే రాష్ట్రానికి పెట్టుబడులు

సీఎం చంద్రబాబు పాలన చూసే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు

'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది

వైకాపా హయాంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను తమ ప్రభుత్వం చెల్లిస్తుంది

ఏపీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయనగరం**

రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని ఏపీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. ఆదివారం విజయనగరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు పాలన చూసే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని చెప్పారు. విజయనగరం జిల్లాలో - మిగతా3లో



### రాజకీయ రంగంలోకి

## ఎలాన్ మస్క్

- పార్టీ గుర్తును రెండు తలల పాము మీమ్
- ది అమెరికా పార్టీ' అనే పేరుతో మూడో రాజకీయ శక్తిని ప్రకటించిన మస్క్
- త్వరలోనే పార్టీ లోగో ప్రకటన

### ఆ సామాజిక వర్గం వారికి

## బీసీ డి ధృవీకరణ పత్రాలు జారీకి చర్యలు

రాష్ట్రవ్యాప్తంగా నగరాలకు బీసీ - డీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా చర్యలు

**అమరావతి**



రాష్ట్రవ్యాప్తంగా నగరాలు సామాజికవర్గానికి బీసీ డి కుల ధృవీకరణ పత్రాలు జారీ చేస్తామని మంత్రి సవిత హామీ ఇచ్చారు. ఆదివారం తాడేప ల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను టీడీపీ బీసీ నగరాల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మరుపిళ్ల తిరుమలేశ్వరరావు సార థ్యంలో ఆ సామాజిక వర్గ నేతలు కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నగరాలకు బీసీ - డీ కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని జీవో ఉన్నా ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకో వడం లేదని మంత్రి దృష్టికి వారు తీసుకు వెళ్లారు. అయితే కేవలం విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నంతో - మిగతా3లో

# రఫేల్ యుద్ధ విమానాలకు వ్యతిరేకంగా చైనా దుష్ప్రచారం!



ఫ్రాన్స్‌కు చెందిన రఫేల్ యుద్ధ విమానాలకు వ్యతిరేకంగా చైనా రాయబార కార్యాలయాల ద్వారా ప్రచారం చేస్తోందని.. ఫ్రెంచ్ యుద్ధ విమానాల సామర్థ్యంపై సందేహాలను లేవనెత్తేందుకు ప్రయత్నిస్తోందని ఫ్రెంచ్ సైనిక, నిఘా సంస్థలు ఓ నివేదికలో వెల్లడించాయి. ఇటీవల భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఈ ప్రచారం భారీగా పెరిగింది. చైనా తమ యుద్ధ విమానాలు రఫేల్ కంటే మెరుగైన ప్రదర్శన చేసినట్లుగా డ్రాగన్ దేశం ప్రచారం చేసుకుంటున్నది. నివేదికల ప్రకారం.. చైనా రాయబార కార్యాలయాల్లో పోస్ట్ అయిన రక్షణశాఖ అధికారులు వివిధ దేశాలను రఫేల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేయొద్దని పట్టుబడుతున్నట్లుగా పేర్కొన్నాయి. రఫేల్ జెట్‌లను కొనుగోలు చేసే అంశాన్ని పరిశీలిస్తున్న ఇండోనేషియాను ఒప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే, చైనా తన యుద్ధ విమానాలను ప్రమోట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నది. వాటిని కొనుగోలు చేయాలని ఆయా దేశాలపై ఒత్తిడి తీసుకువస్తున్నది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత మే నెలలో భారత్-పాకిస్తాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. భారత్ మిస్సైల్స్, యుద్ధ విమానాలను ఉపయోగించి పాక్‌లోని ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసింది. అయితే, పాక్ వాడిన చైనా తయారు చేసిన ఆయుధాలు, ముఖ్యంగా యుద్ధ విమానాలతో పాటు భారతదేశం వాడిన ఫ్రెంచ్‌లో తయారైన రఫేల్ యుద్ధ విమానాలకు వ్యతిరేకంగా ఎలా పని చేశాయో తెలుసుకునేందుకు సైనిక నిపుణులు ప్రయత్నిస్తున్నారు. మూడు రఫేల్ జెట్లతో సహా ఐదు భారత యుద్ధ విమానాలను కూల్చివేసినట్లుగా పాకిస్తాన్ చెప్పుకుంటున్నది. అయితే, అయితే, ఫ్రెంచ్ వైమానిక దళ చీఫ్ జనరల్ జెరోమ్ బెల్లాంజర్ మాట్లాడుతూ.. ఉద్రిక్తతల సమయంలో భారత్ ఒక రఫేల్ యుద్ధ విమానం.. ఒక సుఖోయ్, మిరాజ్2000 సహా మూడు యుద్ధ విమానాలను మాత్రమే కోల్పోయి ఉండవచ్చన్నారు. ఫ్రాన్స్ రఫేల్ యుద్ధ విమానాలను విక్రయించిన అన్ని దేశాల్లో రఫేల్ లక్ష్యంగా చేసుకోవడం ఇదే తొలిసారి. యుద్ధ విమానం కూల్చివేసినట్లయితే ఆ దేశాన్ని దాని గురించి ప్రశ్నించాలని జెల్లాంజర్ పేర్కొన్నారు. రఫేల్, సంబంధిత పరికరాలు ఫ్రాన్స్ ఆయుధ ఎగుమతుల్లో కీలకం. వివిధ దేశాలతో ఫ్రాన్స్ సంబంధాలను మెరుగుపరచడానికి ఇది ప్రధాన మార్గం. ముఖ్యంగా ఆసియాలో చైనా తన ఆధిపత్యాన్ని పెంచుకుంటున్నది. ఈ రోజుల్లో ఫ్రాన్స్ సైతం చైనా ప్రచారాన్ని ఎదుర్కొంటున్నది. ఇందులో పాకిస్తాన్‌తో పాటు చైనా ఉన్నది. సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. రఫేల్ ఫేక్ ఫొటోలను ప్రచారం చేస్తున్నారు. ఏఐతో జనరేటెడ్ కంటెంట్, వీడియో గేమ్ క్లిప్పింగ్‌తో రఫేల్‌ను అపఖ్యాతి పాలు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత్-పాక్ మధ్య వివాదం తర్వాత వెయ్యికిపైగా సోషల్ మీడియా ఖాతాలను సృష్టించగా.. అవన్నీ చైనాకు సాంకేతికను ప్రచారం చేసేందుకు ప్రయత్నించడం గమనార్హం. అయితే, ఇందులో చైనా ప్రభుత్వం ప్రమేయం ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# రాజకీయ రంగంలోకి ఎలాన్ మస్క్



**వాషింగ్టన్:** అమెరికా రాజకీయాల్లో కీలక మలుపు అంటూ,. ప్రపంచ కుబేరుడు, టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ రాజకీయ రంగంలోకి వస్తున్నానంటూ ఆయన స్వయంగా షేర్ చేసిన కొత్త పార్టీ ప్రకటన.. తాజాగా పెద్ద చర్చకు దారి తీసింది. ది అమెరికా పార్టీ' అనే పేరుతో మూడో రాజకీయ శక్తిని ప్రకటించిన మస్క్, ఆ పార్టీకి రెండు తలల పాము మీమ్‌ను షేర్ చేశారు. కానీ మస్క్ నిజంగానే కొత్త పార్టీని పెట్టారా.. ?లేక జనాల్ని వెర్రివాళ్లను చేయడానికే ఇలా చేశారా అనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఎందుకంటే.. అమెరికన్ చట్టాల ప్రకారం..ఆయన అధ్యక్షుడిగా ఎన్నికల బరిలోకి దిగేందుకు అనర్హులు. దీంతో మస్క్ కొత్త పార్టీపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నా యి. మస్క్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికల్లో పోటీ చేస్తారా? లేదంటే.. కొత్త పార్టీ లేదు. ఏమీ లేదు. తూచ్ అని పక్కకు తప్పుకుంటారా? అని చూడాల్సి ఉండగా.. మస్క్ 2028లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్నా, అమెరికన్ రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆయన అనర్హులు. ప్రస్తుత అమెరికా రాజ్యాంగాల ప్రకారం.. ఆర్టికల్ 2, సెక్షన్ 1 ప్రకారం.. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు సదరు అభ్యర్థి అమెరికా పౌరుడై ఉండాలి. తద్వారా మస్క్‌కు అర్హత లేదు. కారణం ఆయన జన్మస్థలం దక్షిణాఫ్రికా కావడం.

**మస్క్ పార్టీపై సవాలక్ష ప్రశ్నలు**

ఈ నేపథ్యంలో, మస్క్ పార్టీ విస్తరణకు ముందు వ్యతిరేక వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. ఆయన మాత్రం అధ్యక్ష పదవిపై నిర్ణయం వచ్చే ఏడాది చెబుతానంటూ ట్వీట్ చేశారు. ఇంతకీ.. మస్క్ టార్గెట్ ఏంటి? అమెరికాను పాలించాలని చూస్తున్నారా? పార్టీగా ప్రభావం చూపాలని అనుకుంటున్నారా? అనేది సదరు అమెరికన్ పౌరుల్లో పుట్టుకొస్తున్న సవాలక్ష ప్రశ్నలు.. ఈ ప్రశ్నలన్నింటికి కాలమే సమాధానం చెప్పాల్సి ఉంది. ఈ క్రమంలో మస్క్ కొత్త పార్టీ ఏర్పాటు? అందుకు గల కారణాలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. అమెరికాలో ప్రస్తుతం అధికార, ప్రతిపక్ష రిపబ్లికన్, డెమోక్రాట్ పార్టీలు ప్రజల స్వేచ్ఛను హరించుతున్నాయని మస్క్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ ప్రతిపాదించిన కీలక 'బిగ్ బ్యూటిఫుల్ బిల్' చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ బిల్లు ఆమోదం పొందిన వెంటనే, మస్క్ అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం జులై 4న తన కొత్త పార్టీని ప్రకటించారు. ముందుగా కొత్త పార్టీ స్థాపన విషయంలో నెటిజన్ల అభిప్రాయాల్ని సేకరించారు. కొత్త పార్టీకి మద్దతుగా 1.2మిలియన్ల మంది నెటిజన్లు స్పందించారు. దాదాపు 80 శాతం మంది మస్క్‌కు మద్దతు తెలిపారు. ఈ ఫలితాల ఆధారంగా, ప్రజల అభిప్రాయాన్ని గౌరవిస్తూ ఆయన కొత్త పార్టీని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు.

**త్వరలోనే పార్టీ లోగో ప్రకటన**

పార్టీ పేరు ది అమెరికా పార్టీగా నామకరణం చేసినా.. పార్టీ గుర్తును రెండు తలల పాము మీమ్‌ను షేర్ చేస్తూ తన పార్టీ ప్రస్తుత రాజకీయ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా నిలబడుతుందనే సంకేతాలిచ్చారు. ఇది అధికారిక పార్టీ లోగోగా ప్రకటించలేదు కానీ.. ప్రారంభ దశలో పార్టీ భావజాలానికి ప్రతీకగా ఈ చిహ్నాన్ని ఉపయోగిస్తున్నారు. భవిష్యత్తులో పార్టీకి ప్రత్యేక లోగో, జెండా, రంగులు ప్రకటించే అవకాశం ఉంది.

**వచ్చే ఏడాది ఎన్నికల్లో మస్క్ పోటీ**

ఇక వచ్చే ఏడాది అమెరికాలో జరగనున్న మధ్యంతర ఎన్నికల్లో 2%-%3 సెనేట్ స్థానాలు, 8%-%10 ప్రతినిధుల సభ స్థానాల్లో ఎలాన్ మస్క్ పోటీ చేయనున్నారంటూ పలు నివేదికలు వెలుగులోకి వచ్చాయి. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడం, ప్రభుత్వ ఖర్చులను తగ్గించడం. తన పార్టీ ద్వారా ప్రజల గొంతుకను వినిపించడమే తన పార్టీ ఉద్దేశమనే నినాధాలతో ప్రజల్లోకి వెళ్లనుంది.


**ఎన్నికల్లో మస్క్ లేజర్ ఫోకస్ వ్యూహం**

అమెరికాలో ప్రతినిధుల సభ సభ్యుల పదవీకాలం కేవలం 2 సంవత్సరాలు. పదవీ కాలం పూర్తయిన వెంటనే ప్రతినిధుల సభలోని 435 స్థానాలకు, సెనేట్ లోని 34 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. తన పార్టీ సైతం ఈ ఎన్నికల బరిలో దిగేలా ఎలాన్ మస్క్ లేజర్ ఫోకస్ వ్యూహాన్ని అమలు చేయనున్నారు. ఈ స్ట్రాటజీ ప్రకారం దేశంలోని అన్నీ స్థానాల్లో పోటీ చేయకుండా.. కేవలం గెలిచే స్థానాల్లో పోటీకి దిగడం, గెలుపు సమీకరణాల్ని మార్చే ప్రయత్నం చేయడం వంటి అంశాలు దీని కిందకే వస్తాయి.

**మస్క్ ముందున్న సవాళ్లు**

కాగా,మస్క్ సంపద, ప్రభావం ఉన్నప్పటికీ, మూడో పార్టీగా ఎదగడం సవాలుతో కూడుకున్నదే. గతేడాది అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ తరుపున మస్క్ ప్రచారం చేశారు. ఆ సమయంలో నేను అమెరికా అధ్యక్షుడిని కాలేను. ఎందుకంటే? నేను సౌతాఫ్రికాలో జన్మించాను. మా తాత అమెరిన్. నేను ఆఫ్రికన్. కాబట్టి నేను అమెరికాకు అధ్యక్షుడిని కాలేను. రాకెట్లను, కార్లను నిర్మించడమే తన లక్ష్యమని చెప్పుకున్న మస్క్ ఇప్పుడు అకస్మాత్తుగా పార్టీ ప్రకటించడం.. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలని ఉందని పరోక్ష సంకేతాలివ్వడంపై అమెరికన్లు పెదవి విరుస్తున్నారు. మస్క్‌కు ఎలక్షన్ ఎర్రి ఉందంటూ మండిపడుతున్నారు.

# ఇతరుల జోక్యం లేకుండా'.. దలైలామాకు అమెరికా శుభాకాంక్షలు



**వాషింగ్టన్:** ఈరోజు (జూలై 6) టిబెటన్ల ఆధ్మాత్మిక గురువు దలైలామా పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయనకు ప్రపంచం నలుమూలల నుంచి శుభాకాంక్షలు అందుతున్నాయి. అయితే అమెరికా దలైలామాకు ప్రత్యేక సందేశంతో శు భాకాంక్షలు తెలిపింది. ఒకవైపు టిబెటిన్లకు మద్దతు పలుకుతున్నట్లు, మరోవైపు చైనాను హెచ్చరిస్తున్నట్లు అమెరికా సందేశం ఉండటం విశేషం. 90వ పుట్టినరోజు జరుపుకుంటున్న దలైలామాకు అమె రికా శుభాకాంక్షలు తెలియజేస్తూ.. టిబెటన్లు తమ మత పెద్దలను స్వేచ్ఛగా, 'ఇతరుల జోక్యం లేకుండా' ఎన్నుకునే సామర్థ్యాన్ని కాపాడుకునేందుకు అమెరికా మద్దతు ఇస్తుందని పేర్కొంది. ప్రపంచానికి దలైలామా ఐక్యత, శాంతి, కరుణల సందేశాన్ని అందిస్తూ, ప్రజల్లో శాంతి నెలకొల్పుతున్నారని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో పేర్కొన్నారు. చైనా పేరు ఎత్తకుండానే రూబియో.. టిబెటన్ల సాంస్కృతిక, మత స్వేచ్ఛకు అమెరికా మద్దతు ఇస్తుందనే సందేశాన్ని తెలియజేశారు. టిబెటన్ల హక్కులు, ప్రాథమిక స్వేచ్ఛల పట్ల గౌరవాన్ని పెంపొందించేందుకు యునైటెడ్ స్టేట్స్ కట్టుబడి ఉందన్నారు. టిబెటన్ల ప్రత్యేక భాష, సాంస్కృతిక, మతపరమైన వారసత్వాన్ని కాపాడే ప్రయత్నాలకు తాము మద్దతు ఇస్తున్నామని, ఇతరుల జోక్యం లేకుండా వారు మత పెద్దలను స్వేచ్ఛగా ఎన్నుకునే సామర్థ్యాన్ని కాపాడుతామని అన్నారు. తదుపరి దలైలామాను ఎన్నుకునే హక్కు తమకే ఉందని చైనా చెబుతున్న ప్రస్తుత తరుణంలో అమెరికా వ్యాఖ్యలు కీలకంగా మారాయి. కాగా టిబెట్‌పై చైనా చారిత్రక అధికారాన్ని డిమాండ్ చేస్తోంది. సామ్రాజ్య యుగం నాటి సంప్రదాయాలను గుర్తుచేస్తూ, తదుపరి దలైలామాను ఆమోదించే హక్కు తమకే ఉందని బీజింగ్ తరచూ చెబుతోంది. టిబెట్‌లో అనుసరించే మతపరమైన ఆచారాలపై కఠినమైన నియంత్రణను కొనసాగిస్తోంది.

## బిహార్ గూండాల రాజ్యంగా మారిపోయింది



**ఇంటర్నెట్ డెస్క్:** బిహార్ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. బిహార్ రాజధాని పట్నాలో ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కా హత్యపై రాహుల్ మాట్లాడుతూ.. నీతీష్ కుమార్ ప్రభుత్వం రాష్ట్రాన్ని గూండాల రాజ్యంగా మార్చిందని దుయ్యబట్టారు. నేడు బిహార్ దోపిడీ, కాల్పులు, హత్యల నీడలో నివసిస్తోందని.. రాష్ట్రంలో నేరాలు జరగడమనేది సాధారణంగా మారిపోయిందన్నారు. వీటిని నిర్మూలించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్ర పౌరులను రక్షించలేని పార్టీకి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలెవరూ ఓటువేయొద్దని విజ్ఞప్తి చేశారు. దారుణాలు, దోపిడీలను పూర్తిగా నిర్మూలించి, పురోగతి వైపు అడుగులు వేసే సమయం బిహార్‌కు వచ్చిందని రాహుల్ పేర్కొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వేసే ఓట్లు కేవలం ప్రభుత్వాన్ని మార్చడానికే కాక.. రాష్ట్రాన్ని రక్షించడానికి ఉపయోగపడతాయన్నారు. ప్రజలు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. పట్నాలో గాంధీ మైదాన్ ఠాణా పరిధిలోని రాంగులాం చౌక్ పనాష్ హోటల్ సమీపంలో గోపాల్ ఖేమ్కా దారుణ హత్యకు గురయ్యారు. శుక్రవారం రాత్రి 11.40 గంటల సమయంలో తన ఇంటికి చేరుకున్న ఆయన కారు దిగుతుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో అతడు మృతి చెందాడు. ఈ ఘటన బిహార్ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. దీనిపై ఆర్జేడీ చీఫ్ తేజస్వి యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గోపాల్ ఖేమ్కాను దుండగులు పట్నా నడిబొడ్డున హత్య చేస్తే.. అక్కడికి పోలీసులు రావడానికి రెండు గంటల సమయం పట్టిందని పేర్కొన్నారు. ఆరేళ్ల క్రితం వ్యాపారవేత్త కుమారుడిని ఇదే విధంగా హత్య చేస్తే.. ఇప్పటికీ ఆ హంతకులను అరెస్టు చేయలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## హిమాచల్‌లో 75 మరణాలు



**సిమ్లా:** హిమాచల్ ప్రదేశ్‌లో వర్ష బీభత్సం కొనసాగుతోంది. ఎడతెరిపిలేని భారీ వర్షాల కారణంగా ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక, హిమాచల్‌లోని మండి జిల్లాలో భారీ వర్షాల కారణంగా మరణాల వారి సంఖ్య 75కు చేరుకుంది. మరోవైపు.. పలు జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ విధించింది. హిమాచల్ ప్రదేశ్‌లో ఒక్క రోజులో 115-204 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. 204 మిల్లీ మీటర్లు అతి తీవ్ర వర్షపాతం కిందకు వస్తుంది. దీంతో, రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన రహదారులపై కొండచరియలు విరిగిపడ్డాయి. దాదాపు 240 రహదారులపై రాకపోకలు కష్టంగా మారినట్లు అధికారులు వెల్లడించారు. ఆకస్మిక వరదలు, కుంభవృష్టితో పరిస్థితి దారుణంగా మారింది. ఎడతెరిపిలేని వర్షం కారణంగా చాలా చోట్ల సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. వీటిల్లో ఒక్క మండి జిల్లాలోనే 176 మార్గాలున్నాయి.

**రెడ్ అలర్ట్ జారీ..**

హిమాచల్ ప్రదేశ్‌లోని కంగ్రా, సిర్మూర్, మండి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. రెడ్ అలర్ట్ విధించింది. అలాగే, రానున్న 24 గంటల్లో చంబా, కంగ్రా, మండి, శిమ్లా, సిర్మూర్ జిల్లాల్లో మెరుపు వరదలు రావొచ్చని హెచ్చరించింది. ఉనా, బిలాస్‌పుర్, హమిర్‌పుర్, చంబా, శిమ్లా, కుల్లు జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. చాలా చోట్ల కొండచరియలు విరిగి పడే ప్రమాదం ఉందన్నారు. బలహీనమైన నిర్మాణాల్లో ప్రజలను ఉండొద్దని హెచ్చరించారు. మరోవైపు.. సహాయక చర్యల్లో ఐటీబీపీ దళాలు పాల్గొంటున్నాయి.


## టెక్సాస్‌లో వరదలు..

## 51 మంది మృతి.. పలువురు గల్లంతు

అగ్ర రాజ్యం అమెరికా లోని టెక్సాస్ రాష్ట్రాన్ని వరదలు ముంచెత్తాయి. గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అక్కడి నదులు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షాలు, వరదల వల్ల 51 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 15 మంది చిన్నారులు ఉన్నారు. వరదల్లో చిక్కుకున్న 200 మందికిపైగా పౌరులను సహాయక బృందాలు రక్షించాయి. మరోవైపు కెర్ కౌంటీలోని గ్వాడలూప్ నది ఉప్పొంగి సమీపంలోని మిస్టిక్ క్యాంప్ వేసవి శిక్షణా శిబిరాన్ని ముంచెత్తింది. దాంతో ఆ శిబిరంలోని 23 మంది అమ్మాయిలు గల్లంతయ్యారు. వారి కోసం రెస్క్యూ టీమ్స్ తీవ్రంగా గాలిస్తున్నారు.

## బ్యాంక్ ఆఫ్ లండన్ పక్కనే..

## చైనా గూఢచర్య కేంద్రం..!



**ఇంటర్నెట్‌డెస్క్:** లండన్‌లో చైనా నిర్మించ తలపెట్టిన భారీ దౌత్యకార్యాలయం ఇప్పుడు యూకేకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఈ విషయాన్ని డెయిలీ మెయిల్ పత్రిక కథనంలో పేర్కొంది. టవర్ లండన్ సమీపంలోని రాయల్ మింట్ వద్ద ఇది ఉండటమే దీనికి కారణం. గతంలో యూకే నిఘా సంస్థ ఎంఐ5, స్కాట్లాండ్ యార్డ్ హెచ్చరించడంతో చైనా కార్యాలయానికి అనుమతులు నిలిపివేశారు. కానీ, ప్రభుత్వం మారిన తర్వాత మళ్లీ పునరుద్ధరించారు. సున్నితమైన ఫైనాన్షియల్ సెంటర్ సమీపంలో చైనా దౌత్యకార్యాలయం నిర్మించడంపై బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ కూడా ప్రధాన మంత్రి కార్యాలయానికి అభ్యంతరాలను పంపింది. చైనా దౌత్యకార్యాలయ స్థలం అత్యంత సమీపంలోనే మూడు భారీ డేటా సెంటర్లు, స్టాక్ ఎక్స్‌ఛేంజి కూడా ఉన్నాయి. చైనా చేపట్టిన నిర్మాణంలో బేస్‌మెంట్ సూట్లు, సొరంగం ఉన్నట్లు కూడా గతేడాది వార్తలొచ్చాయి. గూఢచర్యం కోసం అవసరమైన నిర్మాణాలు చేస్తోందని డెయిలీ మెయిల్ వెల్లడించింది. ఈ భవనంలోని కల్చరల్ ఎక్స్ఛేంజి విభాగాన్ని మాత్రం యూకే అధికారుల తనిఖీ నుంచి మినహాయించాలని చైనా అధికారులు భావిస్తున్నారు. సాధారణంగా గూఢచర్యం కోసం వాడే వాటిని కల్చరల్ ఇంట్రెస్ట్స్, ఎక్స్ఛేంజిగా పేర్కొంటారని అమెరికాకు చెందిన మాజీ సెక్యూరిటీ అధికారి వెల్లడించారు.

**ఏమిటీ మెగా ఎంబసీ..**

2018లో బ్రిటన్ రాయల్ మింట్‌కు చెందిన 5.4 ఎకరాల భూమిని చైనా కొనుగోలు చేసింది. 1809-1967 మధ్యలో బ్రిటన్ రాయల్ మింట్‌లో ఇది భాగమే. అంతకు ముందు బ్లాక్ డెత్‌ప్లేగు సమాధులు ఇక్కడున్నాయి. రాయల్ నేవీ కూడా కొన్నాళ్లు ఈ స్థలాన్ని వినియోగించుకొంది. ఇది టవర్ ఆఫ్ లండన్‌కు అత్యంత సమీపంలోనే ఉంది. బ్రిటన్ రాజకుటుంబం ఈ ప్రదేశాన్ని రియల్ ఎస్టేట్ డెవలపర్లకు విక్రయించింది. దీంతో చైనా కొనుగోలు చేయడం తేలికైంది. దీనిని ఐరోపాలోనే అతిపెద్ద దౌత్యకార్యాలయంగా నిర్మించాలని బీజింగ్ నిర్ణయించింది. ఇందులో 225 ఇళ్లు, కల్చరల్ ఎక్స్ఛేంజి భవనం కూడా ఏర్పాటు చేసేలా ప్లాన్ చేసింది. వాషింగ్టన్ డీసీలోని దౌత్యకార్యాలయం కంటే ఇది రెండు రెట్లు పెద్దగా ఉంటుంది. కొన్ని నెలల క్రితం చైనా దౌత్యకార్యాలయ నిర్మాణంపై ఆందోళనలు కూడా జరిగాయి.

# పెరుగుతున్న సిజేరియన్లు

-మొదటిపేజీ తరువాయి

వస్తున్న వైద్యులు, సిబ్బందికి సాధారణ ప్రసవాలు చేయడంలో నైపుణ్యం కొరవడుతోంది. గర్భిణులు, వారి సహాయకుల్లో ధైర్యం నింపి సాధారణ ప్రసవాల దిశగా అవగాహన కల్పించే ప్రయత్నమూ చేయట్లేదు. ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసూతి, శిశు , మత్తు వైద్యనిపుణుల కొరత ఉంది. కొందరు డాక్టర్లు సహజ ప్రసవంలో ఉండే రిస్క్ తీసుకోలేక కేసులు రిఫర్ చేస్తున్నారు. చివరి నిమిషంలో వెళ్తే సిజేరియన్ తప్పట్లేదు.

సహజ ప్రసవాలంటే భయం, మంచి ముహూర్తంలో బిడ్డను కని వారి తలరాతలు మార్చేయాలన్న విపరీత పోకడలూ ఇందుకు కారణమవుతున్నాయి. అలాగే ప్రస్తుతం కొందరు వృత్తి, ఉద్యోగ వ్యాపకాల్లో పడిపోయి వయసు మీరిన తర్వాత పిల్లలను కనాలన్న ఆలోచనకు రావడంతో ఆరోగ్య సమస్యలు సాధారణ ప్రసవాలకు ప్రతికూలంగా మారుతున్నాయి.

తొలి అడుగు తడబడుతోంది : అమ్మదనాన్ని ఆస్వాదించే తొలి అడుగు తడబడుతోంది. ముందే ఆసుపత్రిలో చేరి, నొప్పి బాధ తెలియకుండానే ప్రసవం చేయించుకునేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. అత్యవసర పరిస్థితుల్లో తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడేందుకు సిజేరియన్ చేయాల్సి ఉన్నా, చాలా సందర్భాల్లో అవసరం లేకున్నా కడుపు కోసి బిడ్డను బయటకు తీస్తున్నారు. దీంతో రక్తస్రావం, ఎలర్జీ, ఇన్ఫెక్షన్, శక్తి సన్నగిల్లడం లాంటి సమస్యలు, గర్భసంచి తొలగించే పరిస్థితీ ఎదురవుతోంది. బిడ్డల్లోనూ శ్వాసకోశ, ఇతరత్రా దీర్ఘకాలిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ప్రపంచ ఆరోగ్యసంస్థ మార్గదర్శకాల ప్రకారం సిజేరియన్లు 10-15 శాతానికి మించకూడదు. ఆంధ్రప్రదేశ్ ఆ గీతను ఎప్పుడో దాటేసింది. జాతీయ కుటుంబ ఆరోగ్యసర్వే-5 గణాంకాల ప్రకారం 2019-2021లో దేశంలో అత్యధిక సిజేరియన్లు జరుగుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ 42.44 శాతంతో మూడోస్థానంలో నిలిచింది. తొలి రెండు స్థానాల్లో తెలంగాణ (60.7 శాతం), తమిళనాడు (44.94 శాతం) ఉన్నాయి. తాజాగా ఏపీలో పరిస్థితి పరిశీలిస్తే ఇది 50 శాతానికి దాటేసింది.

ఎక్కవగా ఆ జిల్లాలోనే : రాష్ట్రంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మే వరకు గణాంకాలు పరిశీలిస్తే మొత్తం ప్రసవాల్లో 53.03 శాతం సి-సెక్షన్ డెలివరీలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ వైద్యశాలల్లో 39.93 శాతం, ప్రైవేట్ ఆసుపత్రుల్లో 63.85 శాతం జరిగాయి. సిజేరియన్లు 50 శాతం దాటిన జిల్లాలు ఏపీలో 17 ఉన్నాయి. అత్యల్పంగా అల్లూరి జిల్లాలో 8.49 శాతం సిజేరియన్లు జరిగితే అత్యధికంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 75 శాతం జరిగాయి. 'సాధారణ ప్రసవాలే తల్లీబిడ్డల ఆరోగ్యానికి మంచిది. తల్లులు త్వరగా కోలుకుంటారు. తల్లి పాలు, బ్యాక్టీరియా (గట్ మైక్రోబియం) బిడ్డకు చేరి వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. సిజేరియన్ ప్రసవాల్లో తల్లి కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఇన్ఫెక్షన్, రక్తస్రావం లాంటి సమస్యలకూ ఆస్కారం ఉంది. భవిష్యత్తులో గర్భం దాల్చాలన్నా సమస్యలు తలెత్తుతాయి. చాలామందిలో తొలిసారి గర్భం దాల్చడం ఆలస్యమవుతోంది. గర్భిణుల్లో ప్రసవ సమయంలో నొప్పులు ఎక్కువనే భయం పోగొట్టాలి. అయినవారి సంరక్షణ, నిరంతర వైద్యసేవలు, సూచనలు తప్పనిసరి. ఆసుపత్రులకు వచ్చే గర్భిణుల్లో అవగాహన కల్పించి మానసిక స్థైర్యం నింపితే సాధారణ ప్రసవాల దిశగా ప్రోత్సహించవచ్చని' విజయవాడలోని ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ లక్ష్మీ శిరీష శాఖమూరి తెలిపారు.

# నాగబాబుకు పదవీ యోగ్యం లేనట్టేనా

**విజయవాడ :** జనసేన ఎమ్మెల్సీ నాగబాబుకు మంత్రి పదవి దక్కే అవకాశం కనిపించడం లేదు. ఆయనకు మంత్రి పదవి వస్తుందని అందరూ భావించారు. అంతకు ముందయితే నాగబాబుకు శాఖలను కేటాయిస్తూ కూడా పెద్దయెత్తున ప్రచారం జరిగింది. అయితే ఇప్పటి వరకూ నాగబాబుకు మంత్రిపదవి ఊసే ఇప్పుడు వినపడటకపోవడం వెనక అనేక కారణాలున్నాయని అంటున్నారు. ఎమ్మెల్సీ అయిన వెంటనే నాగబాబును మంత్రి పదవిలోకి తీసుకుంటామని స్వయంగా పవన్ కల్యాణ్ తో పాటు చంద్రబాబు నాయుడు కూడా మీడియా చిట్ చాట్ లో ప్రకటించడంతో ఆయనకు మంత్రి పదవి ఖాయమనుకున్నారు. కానీ తర్వాత ఇటు చంద్రబాబు, అటు పవన్ కల్యాణ్ లు ఇద్దరూ ఈ విషయంలో కొంత ఆలోచనలో పడినట్లు సమాచారం.నాగబాబుకు సినిమాటోగ్రఫీ శాఖ ఇస్తారని ప్రచారం కూడా జరిగింది. నాగబాబుకు మంత్రి పదవి ఇవ్వడం వల్ల ప్లస్ లు, మైనస్ లు బేరీజు వేసుకుంటే తీసుకోకపోవడమే మంచిదన్న నిర్ణయానికి వచ్చినట్లుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గంలో ఇంకా ఒక పదవి ఖాళీగా ఉంది. ఆ పదవిలో నాగబాబు కంటే వేరు వారికి ఇస్తే రాజకీయంగా కొంత ప్రయోజనం చేకూరుతుందని చంద్రబాబు, పవన్ కల్యాణ్ లు ఇద్దరూ భావించినట్లు తెలిసింది. నిజానికి నాగబాబుకు సామాజికవర్గం కూడా శాపంగా మారింది. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు కేబినెట్ లో జనసేన నుంచి ముగ్గరు



మంత్రులు ఉన్నారు. పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ లు ఉన్నారు. అందులో నాదెండ్ల మనోహర్ మినహాయిస్తే మిగిలిన ఇద్దరు కాపు సామాజికవర్గానికి చెందిన వారు. నాగబాబుకు కూడా పదవి ఇస్తే నలుగురిలో ముగ్గురు కాపు సామాజికవర్గానికి చెందిన వారికి మంత్రి పదవులు ఇచ్చినట్లవుతుంది. కాపుల్లో అసంతృప్తి... అలాగే తెలుగుదేశం పార్టీలో నూ కాపు సామాజికవర్గానికి చెందిన ఇద్దరికి టీడీపీ కూడా మంత్రి పదవులు ఇచ్చింది. పొంగూరు నారాయణ, నిమ్మల రామానాయుడు కూడా కేబినెట్ లో ఉండటంతో ఎక్కువ మంది కాపులకు కేబినెట్ లో అవకాశం ఇచ్చినట్లవుతుందన్న భావన కలుగుతుందని చంద్రబాబు నాయుడు కూడా పవన్ తో చెప్పినట్లు తెలిసింది. తెలుగుదేశం పార్టీలోనూ కాపు సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు అనేక మంది మంత్రి పదవి కోసంఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో నాగబాబును మంత్రివర్గంలో తీసుకుంటే కాపు సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ఒకింత అసంతృప్తికి లోనయ్యే అవకాశముందన్న అంచనాలు కూడా మంత్రిపదవి దక్కకపోవడానికి కారణంగా చెబుతున్నారు. రాజకీయ నేత కాకపోవడంతో... నాగబాబు రాజకీయ నేత కాదు. ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశం లేదు. ప్రజల్లో నేరుగా గెలిచింది లేదు. ఇప్పటి వరకూ ఎమ్మెల్సీలకు చంద్రబాబు మంత్రివర్గంలో చోటు కల్పించలేదు. ఎమ్మెల్సీగా ఒకరికి అవకాశమిస్తే వారి నుంచి కూడా డిమాండ్ అధికమవుతుందని అంటున్నారు. సినిమా నటుడిగా ప్రజల్లోకి పెద్దగా తిరగలేని నాగబాబుకు మంత్రి పదవి ఇచ్చినందున ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువని భావించి చంద్రబాబు పవన్ కల్యాణ్ కు నచ్చ చెప్పి అంగీకరింప చేసినట్లుతెలిసింది. మంత్రి పదవి ఇస్తామని చెప్పి ఇవ్వకపోవడంతోనే నాగబాబు కూడా ఎమ్మెల్సీ పదవి వచ్చిన తర్వాత పెద్దగా యాక్టివ్ గా కనిపించకపోవడానికి కారణమిదేనని అంటున్నారు. మొత్తం మీద నాగబాబుకు మంత్రి పదవి దక్కడం ఇప్పట్లో లేనట్లే కనిపిస్తుంది.

# వ్యవసాయ కూలీ రాత మార్చిన డైమండ్

**కర్నూలు :** కంటికి కనిపించని ఆశతో.. మట్టిలో మెరిసే ఆ వజ్రం కోసం వెతుకుతూ ఎంతో మంది ఇక్కడకు వస్తుంటారు. వజ్రాల కోసం రేయింబవళ్లు గాలిస్తుంటారు. కానీ ముందే అనుకున్నట్లు మనకంటూ రాసుంటే.. అదే మన ఒళ్లో వచ్చి వాలుతుందని. అలా ఎంతో మంది వజ్రాల కోసం వేట సాగిస్తున్నా దొరకని వజ్రం.. ఓ కూలీకి దొరికింది. దీంతో ఆ కూలీ రాత మారబోతోంది. తొలకరి వర్షాలు ప్రారంభమైన తర్వాత కర్నూలులో వజ్రాలవేట ప్రారంభమవుతుంది. కొంత మంది అదృష్టవంతులకు వజ్రాలు దొరుకుతూ ఉంటాయి. ఇలా అదృష్టం ఓ మహిళా వ్యవసాయ కూలీని వరించింది. కర్నూలు జిల్లాలోని తుగ్గలి మండలంలోని పెండెగల్లు గ్రామంలో ఒక మహిళా వ్యవసాయ కూలీకి 15 క్యారెట్ల వజ్రం దొరికినట్లుత ?లుస్తోంది. కర్నూలు జిల్లాలో, ముఖ్యంగా తుగ్గలి మరియు వజ్రకరూర్ ప్రాంతాల్లో, ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వజ్రాల కోసం పొలాల్లో వెతకడం సాధారణం. ఈ ప్రాంతం వజ్రాల నిక్షేపాలకు ప్రసిద్ధి చెందింది, అదృష్టం కలిసొస్తే జీవితం మారిపోతుందనే ఆశతో స్థానికులు ఈ వేటలో పాల్గొంటారు.ఈ వజ్రాన్ని కొనుగోలు చేసేందుకు ఓ వ్యాపారి పది లక్షలు ఆఫర్ చేసినట్లుగా తెలుస్తోంది. కానీ దాని విలువ యాభై లక్షలు ఉంటుందన్న కారణంగా ఆ వ్యవసాయకూలీ కుటుంబం అమ్మకం జరపలేదు. 15 క్యారెట్ల వజ్రం చాలా ఖరీదైనది. 15 క్యారెట్ల వజ్రం అనేది చాలా పెద్ద పరిమాణంలో ఉంటుంది. సాధారణంగా, అంతర్జాతీయ మార్కెట్లో ఒక క్యారెట్ వజ్రం ధర వి1,000 నుంచి వి20,000 (సుమారు రూ. 85,000 నుంచి రూ. 17 లక్షలు) వరకు ఉంటుంది, ఇది నాణ్యతపై ఆధారపడి ఉంటుంది. 15 క్యారెట్ల వజ్రం, మంచి నాణ్యత కలిగి ఉంటే, దాని విలువ సుమారు వి15,000 నుంచి వి300,000 (రూ. 12.75 లక్షలు నుంచి రూ. 2.55 కోట్లు) లేదా అంతకంటే ఎక్కువ లభించే అవకాశం ఉంది. పొలం పనులు చేస్తున్న ఓ మహిళా కూలీకి 15 క్యారెట్ల బరువైన వజ్రం దొరికింది. పొలం పనులు చేస్తున్న సమయంలో మట్టిలో మెరుస్తూ ఓ రాయి కనిపించింది. ఏంటా అని



చూస్తే.. అది వజ్రం. దీంత ఆ కూలీ పంట పండింది. వజ్రం దొరికిన విషయం తెలిసీ.. ఈ వజ్రం కోసం అప్పుడే బేరసారాలు కూడా మొదలైనట్లు సమాచారం. అయితే బేరం కుదరకపోవటంతో ఆ కూలీ.. వ్యాపారికి అమ్మకుండా వజ్రాన్ని తన వద్దే ఉంచుకున్నట్లు తెలిసింది. వ్యాపారి వజ్రాన్ని రూ.10 లక్షలకు ఇవ్వాలని కోరితే.. ఆ కూలీ రూ.50 లక్షలు చెప్తున్నట్లు తెలిసింది. ఈ వార్త ఇప్పుడు తుగ్గలి మండలంలో హాట్ టాపిక్‌గా మారింది.మధ్యప్రదేశ్‌లోని పన్నా జిల్లాలో 2.69 క్యారెట్ల వజ్రం రూ. 50 లక్షలకు అమ్ముడుపోయిన సందర్భం ఉంది. 15 క్యారెట్ల వజ్రం, సమాన నాణ్యత ఉన్నట్లయితే, దాని విలువ రూ. 2-5 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ కావచ్చునని నిపుణులు చెబుతున్నారు. అయితే కర్నూలులో వ్యవసాయకూలీకి లభించిన 15 క్యారెట్ల వజ్రం ఖచ్చితమైన నాణ్యత, రంగు అధికారిక సమాచారం లేదు కాబట్టి ఖచ్చితమైన విలువ అంచనా వేయడం కష్టమే. వారికి ఈ అంశాలపై అవగాహన ఉండదు కాబట్టి స్థానిక వ్యాపారులకే ఇచ్చే అవకాశం ఉంది. ఒక్క వజ్రం కనుగొనడం వల్ల కూలీలు లేదా రైతుల జీవితాలు ఆర్థికంగా మారిపోతాయి. కర్నూలు ప్రాంతంలో కనుగొనబడే వజ్రాలు వాటి నాణ్యతను బట్టి విలువైనవిగా ఉంటాయి. 15 క్యారెట్ల వజ్రం అనేది అసాధారణమైన పరిమాణం అని చెబుతున్నారు. వజ్రాలు దొరికితే చాలు.. జీవితం మారిపోతుదని కూలీలు అనుకుంటారు. అందుకే ఎక్కువ మంది వర్షాకాలంలో ఇతర పనులు వదిలేసి.. వజ్రాల వేట ప్రారంభిస్తారు. మొత్తం జల్లెడ పడతారు. గతంలో పలువురికి ఇలా వజ్రాలు దొరికాయి. వారి జీవితాల్లో ఆర్థిక కష్టాలు తొలగిపోయాయి.

## 9న చిత్తూరు జిల్లాకు వైఎస్ జగన్.. కూటమి సర్కార్‌లో అలజడి

చిత్తూరు జిల్లా: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని చూస్తే సీఎం చంద్రబాబుకు వణుకుపుడుతోంది. వైఎస్ జగన్ ఈ నెల 9న బంగారుపాళెం మామిడి రైతులను పరామర్శించనున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వంలో అలజడి రేగుతోంది. చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు కష్టాలు పడుతున్నారు. రైతులను జ్యూస్ ఫ్యాక్టరీలు దోచుకుంటున్నాయి. కిలో 3 నుంచి 4 రూపాయలకు కొనుగోలు చేస్తూ.. నిలువు దోపిడీ చేస్తున్నాయి. ఈ నెల 9న వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో ప్రభుత్వంలో కదలిక వచ్చింది. కిలో ఆరు రూపాయలకు కొనేందుకు జైన్ జ్యూస్ ఫ్యాక్టరీ సిద్ధమైంది. వైఎస్సార్‌సీపీ హయాంలో కిలో 26 రూపాయలకు మామిడి అమ్మకాలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మామిడి ధర తగ్గిపోయింది. జ్యూస్ ఫ్యాక్టరీలు వద్ద క్యూలైన్‌లో టోకెన్లు ఇచ్చి తక్కువ ధరకే దోచుకుంటున్నాయి. చాలా చోట్ల 3 నుంచి 4 రూపాయలకే జ్యూస్ ఫ్యాక్టరీలు దోచుకుంటున్నాయి.

**వైఎస్ జగన్ పర్యటన ఇలా..**

ఈనెల 9న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో కోలారు, ముళబాగిళు, ఏపీ బోర్డర్ గంగ్రాజుపల్లి, నాలుగు రోడ్లు, పలమనేరు బైపాస్ మీదుగా బంగారుపాళెంకు చేరుకుంటారు.

## ఆ సామాజిక వర్గం వారికి బీసీ డి ధృవీకరణ పత్రాలు జారీకి చర్యలు

-మొదటిపేజీ తరువాయి

పాటు కృష్ణా జిల్లాలో మాత్రమే నగరాలకు బీసీ-డీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారని ఈ ప్రతినిధి బృందం మంత్రి సవితని కలిసి సోదాహరణగా వివరించింది. అలాగే రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో సైతం ఈ సామాజిక వర్గానికి బీసీ - డీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తమకు అర్హత ఉన్నా ఈ ధృవీకరణ పత్రాలు జారీ చేయక పోవడం వల్ల ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సైతం తమ సామాజిక వర్గం కోల్పోతుందని వారు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మంత్రి సవిత సానుకూలంగా స్పందించారు. రాష్ట్రవ్యాప్తంగా నగరాలకు బీసీ - డీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా చర్యలు తీసుకోనేందుకు అధికారులతో మాట్లాడతానని వారికి మంత్రి సవిత హామీ ఇచ్చారు.

## చంద్రబాబు పాలన చూసే రాష్ట్రానికి పెట్టుబడులు

-మొదటిపేజీ తరువాయి

'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందన్నారు. తెదేపా ఎమ్మెల్యేలు, నేతలకు ప్రజలు ఘనస్వాగతం పలుకుతున్నారని మంత్రి చెప్పారు. వైకాపా హయాంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను తమ ప్రభుత్వం చెల్లిస్తుందని.. దీర్ఘకాలికంగా వదిలేసిన సమస్యలను పరిష్కరించే బాధ్యత తీసుకుంటుందని కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి పరిపాలన అందిస్తుందని.. ఈ విషయాన్ని ధైర్యంగా చెబుతున్నామన్నారు. పారిశ్రామిక పార్కుల్లో పరిశ్రమల స్థాపనతో స్థానిక యువతకు ఉపాధి కల్పించే బాధ్యత తీసుకుంటున్నామని చెప్పారు.


## 'అప్పుడు ఊగిపోయారు.. మరి ఇప్పుడేమైంది చంద్రబాబూ?'



తిరుపతి: ఎన్నికలకు ముందు 143 అబద్ధపు హామీలిచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి ఆర్కే రోజా మండిపడ్డారు. చంద్రబాబు, పవన్‌లు కలిసి అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చారని విమర్శించారు. ఈ రోజు(ఆదివారం, జూలై 06) నగరిలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్ట్ కార్యక్రమంలో భాగంగా రోజా మాట్లాడారు. అమరావతిని దోచుకోవడానికి మాత్రమే అధికారాన్ని వినియోగించుకుంటు న్నారన్నారు. ఎన్నికలకు ముందు ఊగిపోతూ చంద్రబాబు మాట్లాడారని,, నేడు మహిళల పై అగాయుత్యాలు పెరిగిపోతున్నా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు రోజా. మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నా ప్రశ్నించేందుకకే ఉన్నానన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఏమయ్యారని రోజా ప్రశ్నించారు. చంద్రబాబు సొంత జిల్లాలో మామిడి రైతులు అవస్థలు పడుతుంటే.. అది ఆయనకు తెలియదా? అని నిలదీశారు రోజా. ఒకవేళ రైతుల సమస్యలు తెలియకుంటే సీఎం పదవికి రాజీనామా చేయడం మంచిదన్నారు. చిత్తూరు జిల్లాలో కిలోమీటర్ల మేర మామిడి రైతు రాత్రి, పగలు అనేది తేడా లేకుండా ఎదురుచూస్తున్నాడని, వారికి మాత్రం పర్మిట్లు ఇవ్వడం లేదని విమర్శించారు.

## సీఎం చంద్రబాబు 10న కొత్తచెరువు పర్యటన

-మొదటిపేజీ తరువాయి



పాల్గొనే అవకాశం ఉంది. సదరు ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా అధికారులకు వివిధ బాధ్యతలను అప్పగించడం జరిగిందన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికా బద్దంగా పటిష్ట ఏర్పాట్లు చేయాలని విధులను కేటాయించిన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో ఎస్.ఓ.పి. ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు.. పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు. ఆ మేరకు విధులను కేటాయించిన అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు ప్రణాళిక బద్దంగా ఏర్పాట్లను పూర్తిచేసి విజయవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అనంతరం ఎస్పీ శ్రీమతి వి.రత్న మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పోలీస్ శాఖ పరంగా చేపట్టే ప్రతిష్టమైన పందోబస్తు ఏర్పాట్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు అధికారులకు తెలియజేశారు. అనంతరం జేసి అభిషేక్ కుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ..లతో కలసి జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ జడ్పి బాలురు, బాలికల పాఠశాలలు, శ్రీ సత్య సాయి ప్రభుత్వ జూనియర్ కాలేజి..లలోని తరగతి గదులు, ప్రాంగణంలోని మైదానంను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు, సూచనలు జారీచేశారు.

అంతకు ముందు వారు పుట్టపర్తి విమానాశ్రయంను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో కె.ఆర్. ఆర్.సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, పుట్టపర్తి, ధర్మవరం ఆర్డీవోలు సువర్ణ, మహేష్, డీఎస్పీ విజయ్ కుమార్,డీఆర్డీఏ పిడి నరసయ్య, సిపివో విజయకుమార్, డీఈవో కిష్టప్ప, జిఎస్ డబ్ల్యూ ఎస్ సుధాకర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి వంశీకృష్ణ రెడ్డి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజు, డిపివో సమత, జిల్లా రవాణాధికారి శ్రీనివాస్, ఎస్ ఎస్ ఏ పీవో దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# సిగాచీలో గల్లంతైన వారి సంగతేంటీ



**హైదరాబాద్ :** హైదరాబాద్ శివారులోని పాశమైలారం లో జరిగిన సిగాచి పరిశ్రమ ప్రమాదంలో గల్లంతయిన వారి ఆచూకీపై స్పష్టత లేదు. వారు కాలి బూడిత అయిపోయి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చివరి నిమిషం వరికి మీ వాళ్ళ ఆచూకీ కోసం ప్రయత్నిస్తామని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం తరపున మీకు అన్ని సహాయ సహకారాలు అందిస్తామని చెబుతున్నారు. కానీ గల్లంతయిన వారి పేర్లు అధికారికంగా ప్రకటించడానికి నిరాకరిస్తున్నారు. సిగాచీ కంపెనీ ప్రమాదంలో గల్లంతైన కార్మికుల విషయంలో సందిగ్ధత ఆ కుటుంబాలను వేదనకు గురి చేస్తోంది. 9 మంది కార్మికులు గల్లంతయినట్టుగా యాజమాన్యం, జిల్లా కలెక్టర్ ప్రకటించారు. ఐదు రోజులు గడుస్తున్నా మృతదేహాలు లభించకపోవడంతో పూర్తిగా దగ్ధమైపోయి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శిథిలాల తొలగింపు ప్రక్రియ పూర్తి కావొస్తోంది. గల్లంతైన వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని సిఎస్ నేతృత్వంలోని కమిటీ గుర్తించినట్ చెబుతున్నారు. బాధిత కుటుంబాలతో సమావేశమైన సిఎస్ రామకృష్ణారావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమ పరిస్థితి ఏంటని గలంతైన కార్మికుల కుటుంబ సభ్యులు నిలదీసినట్లుగా తెలు?సతోంది. చాలామంది కాలిపోయినట్టుగా గుర్తించాం, ఖచ్చితంగా అందరికీ న్యాయం చేస్తామంటూ హామీనిచ్చారు. సమావేశం నుంచి బయటకు వస్తున్న కలెక్టర్ కాళ్లపై పడ్డ బాధిత కుటుంబాలు.. కనీసం వారి వివరాలు అయినా ప్రకటించాలని కోరుతున్నారు. అయితే గల్లంతైన కార్మికులకు నష్టపరిహారంపై ఎలాంటి క్లారిటీ ని అధికారులు ఇవ్వలేదు. మృతదేహాలు లభ్యం కాకపోతే నష్ట పరిహారం ఇచ్చే అవకాశం లేనట్లేనని చెబుతున్నారు. లాకర్ రూంలో లభించిన సెల్ ఫోన్లు కాంట్రాక్టు కార్మికులవేనన్న అనుమానం వ్యక్తమవుతోంది. వారంతాత ?ప్పుడు కనిపించడం లేదు. కాంట్రాక్టు కార్మికులపై ఎలాంటి ప్రకటనా చేయని యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం అవుతోంది. గల్లంతైన కార్మికుల విషయంలో ప్రభుత్వం గట్టి నిర్ణయం తీసుకోవాలన్న విజ్ఞప్తులు వినిపిస్తున్నాయి. సిగాచి పరిశ్రమలో మృతి చెందిన వారికి కోటి పరిహారాన్ని కంపెనీ ప్రకటించింది. ఇవి అందాలంటే.. ఆయా కుటుంబాలకు ఖచ్చితంగా ప్రమాదంలో చనిపోయారన్న డెత్ సర్టిఫికెట్ ఉండాలి. కానీ పూర్తి స్థాయిలో కాలిపోయి.. ఆనవాళ్లు కూడా లభించని వారి కుటుంబాలకు అటు మనుషులు.. ఇటు పరిహారం కూడా లభించే అవకాశం లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. వారంతా ఆవేదనకు గురవుతున్నారు. వీరి సమస్యకు పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు. సిగాచి పరిశ్రమ ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది. చైర్మన్ గా డాక్టర్ బి. వెంకటేశ్వరరావు ఉంటారు. డా.టి. ప్రతాప్ కుమార్, డా. సూర్య నారాయణ, డా.సంతోష్ గుగే సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దుర్ఘటనపై విచారణ చేసి బాధితులతో మాట్లాడి నెల రోజుల్లో నివేదిక సమర్పించాలని ఈ కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే ఈ కమిటీ ప్రమాద స్థలాన్ని పరిశఈలించింది. సిగాచి పరిశ్రమలో ప్రమాదంపై దర్యాప్తునకు నియమించిన కమిటీకి ఛైర్మన్‌గా ఉన్న డాక్టర్ బి. వెంకటేశ్వరరావు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) ఎమెరిటస్ శాస్త్రవేత్తగా ఉన్నారు. సభ్యుడిగా ఉన్న టి. ప్రతాప్ కుమార్ ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్, సూర్యనారాయణ మాత్రం చెన్నైలోని సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్‌లో శాస్త్రవేత్తగా పని చేసి రిటైర్ అయ్యారు. సంతోష్ గుగే పుణేలోని నేషనల్ కెమికల్ ల్యాబొరేటరీ భద్రతా అధికారి ఉన్నారు.

# పొంగులేటీ ఒంటెద్దు పోకడలేనా



**హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్ లో తెలిసి చేస్తారో.. తెలియక చేస్తారో కానీ చిన్న వివాదాలే పెద్ద వివాదాలుగా మారుతున్నాయి. తాజాగా తెలంగాణ కాంగ్రెస్ ముఖ్య నేతలు మీనాక్షి నటరాజన్‌ను విమర్శించారంటూ ఆరోపణలు వస్తున్నాయి. ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే రాష్ట్ర పర్యటన సందర్భంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రె పత్రికలకు ప్రకటనలు ఇచ్చారు. అన్ని ప్రముఖ దినపత్రికలకు ప్రకటనలు ఇచ్చినప్పటికీ అందులో ఎక్కడా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్ ఫోటో కనిపించలేదు. మరో మంత్రి వివేక తన సొంత వెలుగు పత్రికలో ఇచ్చిన ప్రకటనలో మాత్రం మీనాక్షి నటరాజన్ ఫోటో ఉంది. మంత్రి పొంగులేటి వర్సెస్ ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ అన్నట్లుగా రాజకీయాలు నడుస్తున్నాయని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే సాక్షిగా మీనాక్షికి అవమానం జరిగిందని ఫిర్యాదులు చేస్తున్నారు. పొంగులేటి తీరుతో కాంగ్రెస్ లో అసంతృప్తి రేగుతున్నట్లుగా చెబుతున్నారు. ఇటీవలే మీనాక్షి, మంత్రి పొంగులేటికి క్లాస్ పీకినట్లు ప్రచారం జరుగుతోంది. పొంగులేటిని కట్టడి చేస్తుందన్న అక్కసుతోనే మీనాక్షి నటరాజన్ ను అవమానించారని కాంగ్రెస్ నేతల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జినే అవమానిస్తారా అంటూ మంత్రి పొంగులేటిపై సీనియర్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖర్గే దృష్టికి పంచాయతీని తీసుకెళ్లారని అంటున్నారు. మంత్రి పొగంగులేటి శ్రీనివాసరెడ్డి ఇచ్చిన ప్రకటనలు పార్టీ తరపునే ఇచ్చారు. ప్రభుత్వం తరపున ఇచ్చినవి కావు. ప్రభుత్వంలో ఆమెకు ఎలాంటి పదవి లేదు కాబట్టి ఇవ్వలేదని సమర్థించుకోవడావికి కూడా లేదు. పార్టీ తరపున ప్రకటనలు ఇచ్చి.. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్‌ను మర్చిపోవడం అసాధారణం అని.. ఇది యాధృచ్ఛికంగా జరిగింది కాదని కాంగ్రెస్ వర్గాలు నమ్ముతున్నాయి. పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై ఇతర కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన ప్రభావాన్ని తగ్గించేందుకు కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారని ఈ క్రమంలోనే పొంగులేటిపై అసహనం వ్యక్తం చేశారని అంటున్నారు. అయితే పొంగులేటి వర్గీయులు మాత్రం ప్రకటన ఇవ్వడం వరకు పొంగులేటి చూసుకుంటారు కానీ.. అందులో ఎవరెవరి ఫోటోలు ఉండాలి.. డిజైన్ ఎలా ఉండాలన్నది మొత్తం కాంగ్రెస్ పార్టీ పబ్లిసిటీ సెల్ చూసుకుంటుందని.. పొంగులేటి స్పాన్సర్ చేసినంత మాత్రాన్.. అధి పొంగులేటి ఇచ్చినట్లుగా ఎందుకు అనుకుంటారని ప్రశ్నిస్తున్నారు. కేవలం మంత్రిని టార్గెట్ చేయడానికి కొన్ని వర్గాలు ఇలా ప్రచారం చేస్తున్నాయని అంటున్నారు. ఈ అంశాన్ని ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఎలా తీసుకుంటారన్నది ఇప్పుడు కీలకంగా మారింది. అదే సమయంలో మీనాక్షి నటరాజన్ సింప్లిసిటీని కొంత మంది గుర్తు చేస్తున్నారు. ఫ్లెక్సీలు కట్టడం అన్నా, భారీగా పేపర్లలో ప్రకటనలు ఇచ్చి చూపించే విధేయత అన్నా ఆమెకు ఇష్టం ఉండదని.. ఆ విషయం తెలిసే.. ఇలా ప్రకటనలు ఇచ్చారని అంటున్నారు.

# రచ్చెక్కుతున్న ఇంటి పోరు




**హైదరాబాద్ :** బీఆర్ఎస్ లో కల్వకుంట్ల కవిత తుపాను కొనసాగుతూనే ఉంది. నిత్యం ఏదో ఒక కాంట్రవర్సీ కామెంట్స్ చేస్తూ ఆమె అయితే వార్తల్లో ఉంటున్నారు కానీ పార్టీ మాత్రం బద్నాం అవుతుంది. కల్వకుంట్ల కవిత అసంతృప్తి ఇప్పట్లో చల్లారేటట్లు కనిపించడం లేదు. సొంత సోదరుడు కేటీఆర్ ను ఆమె లక్ష్యంగా చేసుకుని చేస్తున్న కామెంట్స్ పార్టీ క్యాడర్ ను కూడా కొంత ఆవేదనకు గురి చేస్తున్నాయి. కల్వకుంట్ల ఇంట్లో ఈ విభేదాలు ఎవరూ ఊహించనవి. కేటీఆర్, కవిత, హరీశ్ రావు అందరూ కలసి కేసీఆర్ కు అండగా ఉంటారని అనుకున్నా రు. కానీ ఇప్పుడు కవిత చేస్తున్న కామెంట్స్ తో పాటు కేటీఆర్ మొండిపట్టు పట్టడం వంటివి చూస్తుంటే రాను రాను ఈ వివాదం మరింత ముదురుతుందని, సద్దుమణిగే అవకాశాలు లేవన్నది స్పష్టంగా తెలుస్తుంది. కల్వకుంట్ల కవిత తన ఫోన తో పాటు తనఇంట్లో వారి ఫోన్లు కూడా గత ప్రభుత్వంలో ట్యాప్ అయినట్లు అనుమానం వ్యక్తం చేయడంతో అధికార కాంగ్రెస్ పార్టీ చేస్తున్న వాదనకు ఊతమిచ్చినట్లయింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేరు నేరుగా ప్రస్తావించకపోయినప్పటికీ ఆయనతో పాటు మరికొందరు కుటుంబ సభ్యులను కూడా టార్గెట్ చేసినట్లు కనపడుతుంది. కేసీఆర్ పక్కనే కోటరీలాగా మారి ఆయనను తప్పుదోవ పట్టిస్తున్నారని కవిత పదే పదే ఆరోపిస్తున్నారు. సంతోష్ రావు గురించి కవిత ఈ వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. ఇక కవిత చేసిన వ్యాఖ్య కూడా పార్టీలోనే కలకలం రేపేదిగా ఉంది. ఎప్పటికైనా తాను ముఖ్యమంత్రిని అవుతానని ఆయన అన్నమాట ఇప్పుడు గులాబీ పార్టీలో గుబులుపుట్టిస్తున్నాయి... కల్వకుంట్ల కవిత అసలు టార్గెట్ ముఖ్యమంత్రి అన్నట్లుగానే మాట్లాడటంతో ఇంక వివాదం మరింత పీక్స్ కు చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇంటిపోరు కారు పార్టీలో ఇబ్బందిగా మారిందని సోషల్ మీడియాలో గులాబీ పార్టీకి చెందిన కార్యకర్తలే కామెంట్స్ చేస్తున్నారు. ఈ వివాదాలకు ఫుల్ స్టాప్ పెట్టి పార్టీని అధికారంలోకి తెచ్చే ప్రయత్నం చేయాలని, ఇలాగే కుటుంబంలో వివాదాలు కొనసాగితే కాంగ్రెస్ కు మరోసారి అవకాశం చేజేతులా ఇచ్చినట్లవుతుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇటు కవిత అటు కేటీఆర్ ఇద్దరూ ఎవరు చెప్పినా వినే పరిస్థితుల్లో లేకపోవడంతో ఇప్పుడప్పుడే ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పడే అవకాశం కనిపించడం లేదని స్పష్టంగా తెలిసింది.

## ఆదరించండి.. అప్రమత్తంగా ఉండండి

**జంతు సంక్రమిత వ్యాధులపై జాగ్రత్త సుమా.**



**నందిగామ, జులై 06 (ప్రజాజ్యోతి)** నందిగామ పట్టణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రపంచ సంక్రమిత వ్యాధుల దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వ విప్, స్థానిక శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య ఆదేశానుసారం జులై ఆరో తారీఖున ఉచిత రాబిస్ వ్యాధి టీకాల కార్యక్రమంలో పాల్గొన్న నందిగామ మున్సిపల్ ఛైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి అనంతరం చైర్పర్సన్ మాట్లాడుతూ పెంపుడు జంతువులు ఆరోగ్యంగా ఉంటేనే మనుషులు కూడా ఆరోగ్యంగా ఉంటారని అదేవిధంగా మనుషులకు ఏ విధముగానయితే పోలియో మేజిల్స్, ఫాక్స్ రాకుండా టీకాలు వేస్తున్నారు అదేవిధంగా పశువులకు కూడా క్రమం తప్పకుండా పెంపుడు జంతువులకు టీకాలు ఇప్పించడం వల్ల మనుషులకు వచ్చు జబ్బులను నివారించవచ్చునని తెలియజేశారు ఈ కార్యక్రమంలో సుమారు 64 కుక్కలకు మూడు పిల్లులకు యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిడి మోజెస్ వెస్లీ , ఏడి బత్తుల వెంకట్రావు ,పశుసంవర్ధక శాఖ డాక్టర్లు ఇతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రజలకు మంచి చేస్తున్న చంద్రబాబు నాయుడు గారే మళ్ళీ రావాలి

**పల్లె ప్రజలు**



**గుంతకల్లు జూలై 6(ప్రజా జ్యోతి):** గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం మరియు ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం లో భాగంగా ఆదివారం 5వ రోజు కార్యక్రమంలో గుంతకల్లు మండలం నక్కనదొడ్డి గ్రామం లో పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం గ్రామం లోని ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు,చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక పేదల ఇంటికి సంవత్సరానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించారు, వయోవృద్దులకు 3000వేలు ఉన్న పెన్షన్ 4000వేలకు ఒకేసారి పెంచారు,తల్లికి వందనం కింద ఇంట్లో ఎంత మంది చదివే పిల్లలు ఉంటే అంతమందికి డబ్బులు ఇచ్చారు అని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తెలిపారు.గ్రామం లో ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ ఉండ గా ఒక మహిళ మాట్లాడుతూ మా ఇంట్లో ఒకరికి పెన్షన్ మా ఇద్దరి పిల్లలకు తల్లికి వందనం మరియు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందాయని నారా చంద్రబాబు నాయుడు కి కృతజ్ఞతలు అంటూ మా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కూడా మాకు బాగా పని చేస్తున్నారు.ఒక విషయం లో ఎమ్మెల్యే మాకు చాలా బాగా స్పందించి మమ్మల్ని కాపాడారు.మళ్ళీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు రావాలని, గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యేగా మీరే రావాలి అని అన్నారు.ఈ కార్యక్రమం లో గుంతకల్లు మండల మరియు పట్టణ కూటమి నాయకులు కార్యకర్తలు నక్కనదొడ్డి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పీర్ల మకాణము నిర్మాణానికి 5 లక్షల విరాళం అందించిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వారి సోదరులు



**గుంతకల్లు జులై 6 (ప్రజా జ్యోతి):** మండలం నక్కన దొడ్డి గ్రామం నందు మొహర్రం పండుగను పురస్కరించుకొని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి గ్రామం లోని పీర్ల మకానము నందు ప్రత్యేక చదివింపులు చదివించి స్వామి వారి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కి వారి సోదరుడు నారాయణ స్వామి కి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం పుట్టి పెరిగిన ఊరి కోసం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వారి సోదరులు బళ్లారి రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర మరియు గుమ్మనూరు నారాయణ స్వామి పీర్ల మాకానము నూతన నిర్మాణానికి 5లక్షల రూపాయలు విరాళం అందించారు.ఈ కార్యక్రమం లో గుంతకల్లు మండల, పట్టణ కూటమి నాయకులు మరియు కార్యకర్తలు నక్కన దొడ్డి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.ం

## పేకాట స్థావరం పై పోలీసుల మెరుపు దాడి



**తాళ్లపూడి,జూలై6,ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం గజ్జరం గ్రామంలో పేకాట స్థావరంపై రాబడిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి ఎస్సై టి.రామకృష్ణ తన సిబ్బందితో కలిసి మెరుపు దాడి చేసారు . పది మంది పేకాటరయుళ్లను అదుపులోకి తీసుకుని.నిందితుల నుంచి రూ. 12,340నగదునుస్వాధీనంచేసుకున్నట్లుతెలిపారు. వీరిని సోమవారం కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు

# కొత్త పట్టిసీమ, గూటాల లో సుపరిపాలన తొలిఅడుగు ఇంటింటికి డోర్ టు డోర్ ప్రచారంలో పాల్గొన్న

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బోరగం. శ్రీనివాస్



**పోలవరం ప్రజా జ్యోతి న్యూస్ జూలై 6** పోలవరం మండలం కొత్త పట్టిసీమ, గూటాల, లో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సుపరిపాలన తొలిఅడుగు ఇంటింటికి వెళ్లినా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బోరగం. శ్రీనివాస్ పోలవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బొరగం శ్రీనివాసులు నాయకులు, కార్యకర్తలతో కలిసి డోర్ టూ డోర్ కార్యక్రమంలో భాగంగా నేరుగా ప్రజల వద్దకు వెళ్ళి కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తయిన సందర్భంగా అమలు చేసిన సంక్షేమ పథకాలు గురించి వివరించటం జరిగింది. తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి 15 వేలు, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వృద్ధులు, వితంతువులకు 4 వేలు, దివ్యాంగులకు 6 వేలు, కిడ్నీ, కాలేయం, తలసిమియా బాధితులకు 10 వేలు, పూర్తి వైకల్యం ఉన్నవారికి 15 వేలు, దీపం పథకం ద్వారా ప్రతి ఒక్కరికి ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, 16, 347 డీఎస్సీ ఉద్యోగాలు, పోలీస్ శాఖలో నియామకాలు, అదేవిధంగా ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చి ప్రజలను ఆర్థికంగా అభివృద్ధిగా చేయడమే కాకుండా రాష్ట్రం అభివృద్ధి చేయటం, ఉపాధి కల్పన దిశగా కూటమి ప్రభుత్వం సుపరిపాలన లో దూసుకు వెళ్తుందని అన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు అన్నదాత సుఖీభవ అమలు చేయటం జరుగుతుందని అన్నారు. ప్రజల వద్ద ఎదురవుతున్న సమస్యలను నేరుగా మై టిడిపి యాప్ ద్వారా సమస్య ప్రభుత్వానికి తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డోకుల నాగేశ్వరరావు పత్తివాడ. శ్రీనివాస్, కోడి. శ్రీనివాస్,నునకాని. రాంబాబు, తెలగంశెట్టి. నాగేశ్వరరావు, తెలగంశెట్టి.ప్రసాద్, ఏనుగుల. శ్రీనివాస్, సత్యనారాయణ, దాకే. ఆనంద్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమాయక గిరిజనులను బెదిరిస్తున్నవడ్డీ వ్యాపారులు


**అనంతగిరి మండలం జులై 6. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్.** గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని మైదాన ప్రాంత వడ్డీ వ్యాపారులుగిరిజన ప్రాంతంలో చొరబడి అధిక వడ్డీలువసూలు చేస్తూ గిరిజనులు మోసాలకు గురిచేస్తున్నారు. అనంతగిరి మండలం చెరుకుబిడ్డ గ్రామంలో కొందరు గిరిజను అవసరాల నిమిత్తం మైదాన ప్రాంత వడ్డీ వ్యాపారాలునుండి కొంత డబ్బులు వారం వారం వడ్డీ కింద తీసుకుంటారు. వారానికి గాని.నెలకుగాని కొంత సొమ్ము చెల్లించవలసి ఉంటుంది. ఈ విధంగా అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసి మాసాలు చేస్తారు. ఆ సమయంలో గిరిజనులుడబ్బులుఇవ్వకపోతే బెదిరింపులకు దిగుతారు వాస్తవానికి. ఫైనాన్స్ వ్యాపారం చేయాలంటే ప్రభుత్వం అనుమతి తప్పనిసరిగా ఉండాలి. ఎటువంటి అనుమతులు లేకుండా ఎస్.కోట వైజాగ్. రాజమండ్రి ప్రాంతాలవాసులు ఫైనాన్స్ వ్యాపారాలు చేస్తూ ఇష్టం వచ్చిన రీతిలో డబ్బులు వసూలు చేస్తున్నారు.ఆదివారం నాడు చెరుకు బిడ్డ గ్రామానికి చెందిన ఒక గిరిజన మహిళను డబ్బులు ఇస్తావా చస్తావని బెదిరిస్తుండగా కరివేసి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు పాడి నాగేశ్వరరావు వ్యాపారాలను ప్రశ్నించగాసదరు వ్యక్తిని కూడా బెదిరించి ఇష్టం వచ్చినట్లు వ్యాపారులు వివరించి భయభ్రాంతులుసృష్టిస్తున్నారని నాగేశ్వరరావు ప్రజా జ్యోతి దినపత్రిక తెలిపారు. అనంతగిరి



పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ స్పందించి శాఖ పరమైన చర్యలు తీసుకొని వ్యాపారుల మోసాలను అరికట్టాలని ఆయన కోరారు.

# వైభవంగా మారు రథయాత్ర














**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండల కేంద్రంలో మహారాజా మార్కెట్ ఆవరణంలో మారు రథయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ కోదండ రామస్వామి ఆలయం నందు కొలువుదీరిన సుభద్ర బలరామ సహిత జగన్నాధునికి ప్రధాన అర్చకులు తాడేపల్లి పార్వతీపురం విశ్రాంతి అధ్యక్షులు గోపాల కృష్ణమాచార్యులు ,కోదండ రామ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు పొందూరు జగన్నాథ ఆచార్యులు స్వామివారికి తొమ్మిదిరోజుల పాటు విశేషంగా పూజలు నిర్వహించారు. ఆదివారం నాడు ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచారు. పురోహితులు జాడ కన్నబాబు ,పొందూరు గోపాల కృష్ణమాచార్యులు ,పొందూరు శ్రీనివాస ఆచార్యులు ,పొందూరు జగన్నాథ ఆచార్యులు, మురళీ కృష్ణమాచార్యులు మార్కెట్ ఆవరణంలో స్వామి వారికి విశేషంగా పూజలు ,మంగళ హారతులు నిర్వహించారు. వివిధ గ్రామాల నుండి భక్తులు ఈ యాత్రలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. పిల్లలతో ఏర్పాటు చేసిన కోలాటాలు , గరిడి విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీటితో పాటు లలితా గ్రూప్ సభ్యులు విష్ణు సహస్ర నామ పారాయణం చేపట్టారు. దీంతో మార్కెట్ ఆవరణం అంతా కోలాహలంగా మారింది. ఈ కార్యక్రమంలో అనకాపల్లి శ్రీనివాస రావు రాంబిల్లి నాగరాజు గాడు నాగరాజు ,కోరుకొండ విజయ్ కుమార్ , రాంబిల్లి శ్రీనివాస్ రావు , బొడ్డేపల్లి జనార్దన రాంబిల్లి అప్పారావు ,పాత్రికేయులు రాయపిల్లి రాంబాబు గిడిజాల భాస్కర రావు ,మాన్యాన వెంకట రావు ,యర్రా సతీష్ ,లలిత గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ లక్ష్మీనారాయణ స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించిన జిల్లా కలెక్టర్ శ్రీ వినోద్ కుమార్

**గుంతకల్లు జూలై 6 (ప్రజా జ్యోతి):** కసాపురం శ్రీశ్రీశ్రీ లక్ష్మీనారాయణ స్వామి రాతి దేవస్థానం నందు అనంతపు రం జిల్లా కలెక్టర్ శ్రీ వినోద్ కుమార్ ఐఎఎస్ కుటుంబ సభ్యులతో స్వామి వారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త. లు ఆలయ కమిటీ సభ్యులు ఆలయ అర్చకులు స్వాగతం పలుకుతూ ఆలయ ప్రాంగణం లో ఉన్న ఉపాలయాలను దర్శించి శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగినది .అనంతరం కలెక్టర్ వినోద్ కుమార్ వారి సతీమణి దంపతులను శానవాతో సన్మానించి స్వామివారి పట్టు వస్త్రాలు లడ్డు స్థల చరిత్ర పుస్తకాలు ప్రసాదాలు ఇవ్వడం జరిగినది.తొలి ఏకాదశి పురస్కరించుకొని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు ఆలయ అర్చకులు రాకేష్ స్వామి చెన్నకేశవ స్వామి వారు ప్రత్యేక పూజ సేవలలో భాగంగా 1008 సార్లు తులసి దలార్చిన సేవ ఆలయ ధర్మకర్త లు తలారి పరశురాముడు శకుంతల దంపతు చేతుల మీదుగా నిర్వహించారు. భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగినది.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం తొలి ఏకాఈ దశి రోజున శ్రీ లక్ష్మీనారాయణ స్వామివారిని దర్శించడం మహాభాగ్యంగా





భావిస్తున్నా మని మందిరం ఎంతో బాగుందని ఆలయంలో ప్రాంగణంలో ఉన్న ప్రసన్నాంజ నేయ స్వామి వారి నుండి అన్నీ దేవుళ్ళ ఉపా ఆలయా లు సుందరంగా చాలా అద్భు తంగా ఉన్నాయని ఈ దేవస్థానం ముసు ముందు ఎంతో అభివృద్ధి తో ముందుకు వెళుతుందన ఈ ఆలయ నిర్మాణాన్ని నిర్మించి ఎంతో మందికి మంచి దైవమార్గం ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందిం చిన ఈ ఆలయ వ్యవస్థాపకు లు ధర్మకర్తలు వారిమంచి మనసుకు నిదర్శనం అని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆశీస్సులతో గుంతకల్లు మరియు అనంతపురం జిల్లా ప్రజలందరికీ మంచి జరగాలని కోరుచున్నాను,ఆలయ ధర్మకర్త తలారి పరుశురాముడు మాట్లాడుతూ ఈరోజు తొలి ఏకాదశి శుభాకాంక్షలు ప్రజల కు భక్తులకు తెలియజేస్తూ ఈరోజు ఇంతటి పవిత్రమైనటు వంటి రోజున జిల్లా కలెక్టర్ వారు కుటుంబ సమేతంగా రావడం చాలా సంతోషం స్వామి అమ్మ వార్ల మూర్తుల విగ్రహాలు ఎంతో తేజస్సువం తంగా ఉన్నాయి ఆలయ అభివృద్ధిలో కూడా1008 మా వంతు సహకారం అందిస్తామ ని తెలపడం వారికి ఆలయ కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ అందరికీ తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేస్తు న్నాను.అనంతరం అన్న ప్రసాద వితరణ లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రమాదేవి ఎస్సై వెంకటస్వామి ట్రస్ట్ శంకర్ ఆలయ ప్రచార కార్యదర్శి సుధాకర్ ఓంశాంతి ప్రసాద్ వీఆర్వో కృష్ణ మల్లి రంగస్వామి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగినది.

## 8న పత్తికొండలో వైసిపి నియోజకవర్గ విస్తృత సమావేశం



**ప్రజా జ్యోతి పత్తికొండ** పత్తికొండ పట్టణంలో ని గోపాల్ ప్లాజాలో జూలై 8వ తేదీ మంగళవారం ఉదయం 10 .00 గంటలకు వైఎస్ఆర్సిపి నియోజకవర్గ విస్తృత సమావేశం మాజీ ఎమ్మెల్యే శ్రీ దేవమ్మ అధ్యక్షతన జరుగుతున్నట్లు వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నగేష్ యాదవ్, మండల వైసీపీ కన్వీనర్ల గోపాల్ రెడ్డి లు తెలిపారు. ఈ సమావేశానికి వైసీపీ జిల్లా అధ్యక్షులు ఎస్ వి మోహన్ రెడ్డి, కర్నూల్ పార్లమెంటు అబ్జర్వర్ గంగుల ప్రభాకర్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. కావున మండలములోనే వైఎస్ఆర్సిపి నాయకులు ,కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయవలసిందిగా కోరడమైనది.

## యస్వీయూ జాబ్ మేళాలో 24 మంది ఎంపిక



**జూలై 6 తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని స్టూడెంట్స్ వెల్ఫేర్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ జూలై నెల 6 వ తేదీ ఎం. ఆర్. ఎఫ్. సంస్థ ఉద్యోగ మేళా నిర్వహించింది. యస్వీయూ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, డైరెక్టర్ ఆచార్య మురళీధర్, డాక్టర్ పత్తిపాటి వివేక్ జ్యోతప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యస్వీయూలో నిర్వహించినజాబ్ మేళాలో 53 మంది నిరుద్యోగ అబ్బాయిలు పాల్గొన్నారు. కాగా 24 మందిని ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేశారు. వీరికి త్వరలో నియామక పత్రాలు అందజేస్తారని విశ్వవిద్యాలయ అధికారులు అన్నారు.

## పొందూరులో ఘనంగా ప్రపంచ జోనోసిస్ డే



**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** ప్రపంచ జోనోసిస్ డే సందర్భంగా పొందూరు వెటర్నరీ ఆసుపత్రి నందు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ప్రముఖ శాస్త్రజ్ఞులు లూయిపాశ్చర్ ని సంస్మరణచేసుకుంటూ, పశువులు జంతువులు నుండి మానవాళికి సంప్రదించే అనేక రకమైన ప్రాణాంతక అంటువ్యాధులు వ్యాపించకుండా పలు జాగ్రత్తలు , సూచనలు అందజేశారు. సుమారు 35 కుక్కలకు ఉచిత యాంటీ రేబీస్ వ్యాక్సినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి రఘునాథ్ ,ఏరియా వెటర్నరీ ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్ ,పొందూరు ,ఎల్.ఎస్. ఏ శంకర్ నారాయణ, అప్పారావు ఎంఏవిసి డాక్టర్ బి.వి.ఎన్ రాజు దేవి కొండల నాయుడు, శివకుమార్, పాల్గొని ఉన్నారు

## ఈనెల 9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి....



**ప్రజా జ్యోతి పత్తికొండ** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి రామచంద్రయ్య, సిపిఎం సీనియర్ నాయకులు రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పత్తికొండ పట్టణంలోని చదువుల రామయ్య భవనంలో సిఐటియు మండల కార్యదర్శి గోపాల్, ఏఐటియుసి నెట్టకంటయ్య అధ్యక్షతన సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తులు మాట్లాడారు. 1986లో అమెరికాలోని చికాగో నగరంలో కార్మిక వర్గం 8 గంటల పని విధానం కోసం ప్రాణ త్యాగాలు చేసి పోరాటాల ద్వారా 8 గంటల పని దినాన్ని సాధించుకున్నారన్నారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి, కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లు మార్చి కార్మిక హక్కులను హరింపు చేస్తున్నాయని అన్నారు. బడా కార్పొరేట్లకు అనుగుణంగా చట్టాలు తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లేబర్ కోడ్లు ను నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులను కాలరాస్తే సహించేది లేదని అన్నారు. కార్మికుల 8 గంటల పని దినాన్ని కొనసాగించకపోతే ప్రభుత్వాలకి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం. రవిచంద్ర, ప్రజానాట్యమండలి ఏఐటియుసి తాలూకా కార్యదర్శి ఎం రంగన్న, జిల్లా నాయకుడు కాశి, సిపిఐ మండల కార్యదర్శి రాజా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్ ట్యాంక్ ను పరిశీలించిన అనంతపురం ఇంజనీరింగ్ ఎస్సీ రామ్మోహన్ రెడ్డి



**గుంతకల్లు జులై 6 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు పురపాలక సంఘం సమ్మర్ స్టోరేజ్ (ఎస్ ఎస్) ట్యాంక్ ను ఆదివారం అనంతపురం ఇంజనీరింగ్ ఎస్సీ రామ్మోహన్ రెడ్డి నీటి నిల్వ శాతాన్ని పరిశీలించి అనంతరం ఫిల్టర్ బెడ్లను, మోటార్ల పనితీరును పరిశీలించారు.పట్టణము నందు పలు వాటర్ ప్యూరిఫైడ్ ఆర్వో ప్లాంట్లను పరిశీలించా రు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్,మున్సిపల్ ఇంజనీర్ ఇంతియాజ్, డిప్యూటీ ఇంజనీర్ షబానా, సుదర్శన్ ఏఈ మరియు అమెనిటీ సచివాలయ సెక్రటరీస్ పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లాలో తల్లిదండ్రుల భాగస్వామ్యంతో విద్యా విప్లవం

**జూలై 10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.0 ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహణకు సిద్ధం**

**బాపట్ల జులై 6 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల జిల్లా విద్యా రంగంలో మరో కీలక అడుగు వేస్తోంది. జూలై 10న జిల్లాలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.0 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. దీనితో పాటు ఏక్ పేడ్ మాకే నామ్, తల్లి పేరుతో ఒక మొక్క పేరిట పర్యావరణ పరిరక్షణకు ఓ వినూత్న ఆలోచనను ముందుకు తీసుకు వస్తున్నామని కలెక్టర్ తెలిపారు .ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, ఎస్ఎంసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, శ్రేయోభిలాషులు, స్థానిక సంస్థల సభ్యులు, విద్యాశాఖ అధికారులు పాల్గొనే ఉన్నారని చెప్పారు.ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశాలు విద్యార్థుల విద్యా, ఆరోగ్య పురోగతిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంపాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాములుగా చేయడం పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల మద్దతు తీసుకోవడంసమాజం మొత్తం పాఠశాల వైపు దృష్టి పెట్టేలా చేయడం అని పేర్కొన్నారు ఈ సమావేశం ఉ. 11:30 నుండి మ. 1:00 వరకు జరగనుంది వివరాల్లోకి వెళితే మొదటగా ముఖ్య అతిథుల స్వాగతం,మా తెలుగు తల్లికి ప్రార్థనా గీతం ,తల్లికి వందనం నివేదిక,పాఠశాల అభివృద్ధిపై నివేదిక,ఉత్తమ విద్యార్థుల ప్రసంగాలు, తల్లిదండ్రుల వక్తవ్యాలు,పూర్వ విద్యార్థుల ప్రసంగం,డ్రగ్స్ వ్యతిరేక అవగాహన, సైబర్ నేరాలపై విద్యార్థుల సందేశం, ముఖ్య అతిథి సందేశం, విద్యార్థుల ప్రశ్నల కు ప్రత్యుత్తరాలు ఇవ్వటం జరుగుతుంది అని చెప్పారు ఏక్ పేడ్ మాకే నామ్, కార్యక్రమం హైలైట్‌గా ప్రతి విద్యార్థి తల్లి పేరుతో ఓ మొక్క నాటి, గ్రీన్ పాస్‌పోర్ట్ అందుకుంటాడు. ఇది పర్యావరణ పరిరక్షణకు ఒక గుర్తింపుగా నిలవనుంది. తల్లి ప్రేమను స్మరించుకుంటూ, భవిష్యత్ తరం కోసం ఆకుపచ్చ భూమిని అందించేందుకు పిల్లల నుంచి ప్రారంభం అవుతుంది ఈ ప్రయాణం అని తెలిపారు కార్యక్రమం ముగింపులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు కలిసి పాఠశాల అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని ప్రతిజ్ఞ తీసుకోనున్నారు. అనంతరం,డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం,తో అతిథులకు, తల్లిదండ్రులకు ఆదరాభిమానాలతో విందు ఏర్పాటు చేయబడుతుందన్నారు . విద్యా విప్లవంలో ప్రతి తల్లిదండ్రి పాత్ర పోషించాలనే లక్ష్యంతో,బాపట్ల జిల్లా మరో ముందడుగు వేస్తోంది. విద్య, పర్యావరణ పరిరక్షణ, సామాజిక భాగస్వామ్యంలో ఇది ఒక మైలురాయి కానుంది పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకొని, ప్రతి



పాఠశాలలో సక్రమ ఏర్పాట్లు చేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి, ఐఏఎస్ తెలిపారు. జిల్లా అటవీ శాఖ సూచనల మేరకు ఎంఈఓ లు మొక్కల పంపిణీకి సంబంధించి నర్సరీ పాయింట్లకు వెళ్లి, అవసరమైన మొక్కలను తగిన సమయానికి ఆయా పాఠశాలలకు చేరవేయాలని సూచించారు.

## ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి:


**వన్ టౌన్ సీఐ మనోహర్**

**ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన**



**గుంతకల్లు జులై 6 (ప్రజా జ్యోతి):** అదివారం గుంతకల్లు పట్టణంలోని భాగ్యనగర్ లో శ్రీ రామ భక్త ఆంజనేయ స్వామి దేవాలయం కమిటీ మరియు జనవిజ్ఞాన వేదిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంయుక్తంగా అనంతపురం కిమ్స్ సవీరా హాస్పిటల్ వైద్యులచే ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంతకల్లు వన్ టౌన్ సీఐ మనోహర్,పోలేరమ్మ ఆలయ కమిటీ ధర్మకర్త సంఘ సేవకులు మేస్త్రి దొడ్డప్ప, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.హరిప్రసాద్ యాదవ్ పాల్గొన్ని శిబిరాన్ని ప్రారంభించారు.అనంతరం వారు ప్రసంగిస్తూ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసినటువంటి ఇలాంటి శిబిరాలను పూర్తిస్థా యిలో వినియోగించుకోవాలని పేర్కొన్నారు.ఆరోగ్యానికి మించిన సంపద లేదని ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పేదరికం విద్య సామాజిక చైతన్యంతో పాటు మనం నివసించే ప్రదేశం భౌతిక వాతావరణం వంటి పలు అంశాలు ఆరోగ్యం పై ప్రభావం చూపుతాయని ప్రతి ఒక్కరు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.అనంతరం గుండె వైద్యనిపుణులు నితీష్ కుమార్ దాదాపు 100 మంది రోగులను పరీక్షించి పలు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గురుస్వామి లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు టీజీ సురేష్, కార్యదర్శి నాగార్జున, జనవిజ్ఞాన వేదిక నాయకులు నీలకంఠ, నారాయణస్వామి,లాయర్ నాగార్జున,క్యాంప్ ఆర్గనైజర్ రమేష్ ,శ్రీకాంత్, భావన, కస్తూరి, ప్రతిమ,సుహాన తదితరులు పాల్గొన్నారు.

## పాత నూతన గూడెం లో నూట ఒక్క బిందెలతో వినయక స్వామికి అభిషేకం



**పోలవరం ప్రజా జ్యోతి న్యూస్ జూలై 6** తొలిఏకాదశి సందర్భంగా నూతన గూడెం వెంచేసియున్నా శ్రీ వార సిద్ధి వినాయక స్వామికి నూట ఒక్క బిందెలతో వినయక స్వామికి అభిషేకం చేసి నుట ఒక్క కొబ్బరికాయలు కొట్టి నూతన గూడెం గ్రామ ప్రజలు మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జల్లేపల్లి. సూర్యనారాయణ, పాడిగంటలు బాగా పండాలని గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని స్వామి వారిని కోరారు. ఈ కార్యక్రమంలో జల్లేపల్లి. రాంబాబు భాస్కర్ రావు, సుబ్బారావు, తైలం. సత్తిబాబు, బ్రహ్మయ్య, వెంకటేశ్వరరావు, పిల్లలు పెద్దలు పాల్గొన్నారు.

# డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

**:ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్వామిదాస్ మాదిగ:**


**ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్వామిదాస్ మాదిగ**

**గుంతకల్లు జులై 6 (ప్రజా జ్యోతి):**స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేద్దామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామిదాసు మాదిగ పేర్కొన్నారు. ఆదివారం మాజీ ప్రధాని డాక్టర్ జగ్జీవన్ రామ్ 39 వ వర్ధంతిని పురస్కరించుకొని ఎమ్మార్పీ ఎస్ ఆధ్వర్యంలో గుంతకల్లు పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ముందు ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి స్వామిదాస్ మాదిగ ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్వామిదాస్ మాదిగ మాట్లాడుతూ,అణగారిన వర్గాల కోసం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కోసం వారి హక్కులకై అహర్నిశలు శ్రమించి, బడుగు బలహీన వర్గాల కోసం పోరాటం చేసిన మహనీయులు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్,కేంద్ర రక్షణ శాఖ మంత్రిగానూ కార్మిక శాఖ మంత్రిగాను రైల్వే శాఖ మంత్రి గాను వ్యవసాయ శాఖ మంత్రి గాను కమ్యూనికేషన్స్ మంత్రి గాను భారతదేశానికి సేవలు అందించిన ఏకైక వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ తిరుగు లేని నాయకుడిగా జననేతగా బడుగుల బంధువుగా అణగా రిన వర్గాల ఆశాజ్యోతి గా వెలుగొందిన ఏకైక వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, 1908 సంవత్సరం ఏప్రిల్ నెల 5వ తారీఖున బీహార్ రాష్ట్రమునం దు చాంద్వా అనే కు గ్రామంలో శోభిరామ్ బసంతి దేవి ల పుణ్య దంపతులకు జన్మించా రు ఆయన చిన్నతనము నుండే అంటరానితన ,కుల వివక్షతను రూపుమాపడానికి అహర్నిశలు కృషి చేసినారు బడుగు బలహీన వర్గాల కోసం ఎన్నో సంస్కరణలను తీసుకు వచ్చిన ఏకైక వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, అంతే కాకుండా నెహ్రూ క్యాబినెట్లో అతి చిన్న వయసులోనే కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా పనిచేసి న మహనీయులు డాక్టర్ బాబు జగజ్జీవన్ రావు. ఓటమి ఎరుగని నాయకునిగా పోరాట యోధుడిగా భారతదేశ చరిత్ర లో 50 సంవత్సరాలుగా పార్లమెంట్ మెంబర్ గా కొనసా గిన చరిత్ర డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అట్టడుగు జాతి లో పుట్టి ఎన్నో ఆటుపోటా లను ఎదుర్కొని, భారతదేశా నికి ఉప ప్రధానిగా 1977 నుండి 79 వరకు భారతదేశ ప్రజలకు సేవలు అందించినా రు.స్వాతంత్ర సమరయోధుడు గాను,30



సంవత్సరాలు కేంద్ర మంత్రిగాను సేవలందించిన ఏకైక వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 1986 జూలై 6న ఆయన పరమపదించారు. ఆయన ఆశలను కొనసాగిస్తూ, భవిష్యత్ తరాలకు ఆయన స్ఫూర్తి ని స్మరణ చేసుకుంటూ ఆయన సేవలును, స్మరించు కుంటూ ఘనంగా నివాళుల ర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సంచార జాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు, గుంతకల్ టౌన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి హరిబాబు,చిన్న రాయుడు, ఎల్ఐసి రిటైర్డ్ ఆఫీసర్ ఉల్లిగప్ప,రైల్వే ఆఫీసర్ వసంత కుమార్, ఎమ్మార్పీఎస్ టౌన్ నాయకు లు మోహన్ మాదిగ, రాంబా బు మాదిగ,జయరాం, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## బురదమయంలో మెట్టవలసగ్రామం స్థానికులు ఇక్కట్లు గ్రామాన్ని సందర్శించిన తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సుబ్బారావు.



**అనంతగిరి మండలం జులై 6. ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్.** మారుమూల గిరిజన గ్రామాలలో నివసిస్తున్న ఆదివాసి గిరిజనులు కనీస సౌకర్యాలు లేక సమస్యల వలయంలో అల్లాడిపోతున్నారు.గత ప్రభుత్వం నిర్లక్ష్యంకారణంగా కనీస సౌకర్యాలు కరువయని గిరిజనులు గగ్గోలుపెడుతున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం లంగుపర్తి గ్రామపంచాయతీ పరిధి మెట్టవలస. నేల పాలెం గ్రామాలలో సుమారు 200.మంది గిరిజనులు వ్యవసాయ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మెట్టవలస గ్రామానికి రహదారి.మంచినీటి సౌకర్యాలు లేవు గ్రామం మొత్తం బరుదమయంగా మారింది ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల వల్ల గ్రామంలోకి నీరు చేరి అస్తవ్యస్తంగా ఉండడంతో సమాచారం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సుబ్బారావు తన బృందంతో ఆదివారం నాడు రెండు గ్రామాలలో పర్యటించి ప్రజలు పడుతున్న కష్టాలను స్వయంగా చూసి కన్నీరు మున్నీరు అయ్యారు. గ్రామాలకు కనీస సౌకర్యాలు లేకపోవడం చాలా బాధాకరమని గ్రామాల మధ్యలో సిమెంట్రోడ్లు నిర్మాణం కూడపంచాయితీ పాలకులు చేపట్టకపోవడం విచారకరమని అధ్యక్షుడు ఆవేదన చెందినట్లు ఆదివారం నాడు విలేకరులకు తెలిపారు. రెండు గ్రామాల సమస్యలను అరకు ఇంచార్జ్ దోన్నదోరదృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చినట్లు తెలిపారు

# జూలై 9న దేశవ్యాప్త సమ్మెలో భాగస్వామ్యం కానున్న మున్సిపల్ కార్మికులు.

**జూలై 9న నిలిచిపోనున్న పురకార్మికుల సేవలు.**

**కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలి.**

**సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు.**

**బద్వేల్ జూలై 6 (ప్రజా జ్యోతి న్యూస్)** నాడు కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు 2025 జూలై 09వ తేదిన నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం పై మున్సిపల్ కార్మికుల గేట్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు మాట్లాడుతూ స్వతంత్ర పూర్వం బ్రిటిష్ వారితో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం భారతీయ కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలను విరమించుకోవాలని, కాంట్రాక్ట్- అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, ఆప్కాస్ సంస్థను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే చర్యలను విడనాడాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని, అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాల్లో కూడా విస్తరింప చేయాలని, భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లెయిమ్ లను సత్వరమే పరిష్కరించాలని, రాష్ట్రంలో 12వ వేతన సంఘాన్ని వెంటనే నియమించాలని ఆలోపు మధ్యంతర భృతి ఇవ్వాలని, సిపిఎస్ పెన్షన్ స్కీమ్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, రాష్ట్రంలో పని గంటలు పెంచే ఆలోచనను విరమించుకోవాలని, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, గత రాష్ట్రవ్యాప్త సమ్మె సందర్భంగా అంగీకరించిన ఒప్పందాలకు జీవోలు జారీ చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని తదితర



సమస్యల పరిష్కారం కై జాతీయ కార్మిక సంఘాలు జూలై 9వ తేదీన నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.నాగేంద్రబాబు, పట్టణ అధ్యక్ష- కార్యదర్శులు పి.శ్యామ్ ప్రవీణ్, డి. నాగేంద్రబాబు, కార్యనిర్వాహక అధ్యక్షులు డి.హరి, కోశాధికారి కె.శివకుమార్, ఉపాధ్యక్షులు జి.శ్రీనివాసులు ,డి.దేవమ్మ, కార్యదర్శులు సత్యరాజు ,యన్. పాలయ్య కమిటీ సభ్యులు పి.పెంచల వరప్రసాద్, టి.కిరణ్,ఐ. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మానవతా సంస్థల సేవలను ప్రతి ఒక్కరూ ఆదరించాలి

**తాంద్ర సాంబశివరావు**



**బాపట్ల జులై 6 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** కర్లపాలెం మండలంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యక్రమాలపై చర్చాగోష్టి నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు తాంద్ర సాంబశివరావు పాల్గొన్నారు. మానవతా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. పేద, బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్న సంస్థను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కర్లపాలెంలో మానవతా సేవా కేంద్రాన్ని ప్రారంభించే ఆలోచనకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో బాపట్ల జిల్లా మానవతా సంస్థ చైర్మన్ డాక్టర్ శరత్ బోస్, మండల టీడీపీ అధ్యక్షులు భూపతిరావు మాస్టారు, హరిబాబు, హరిప్రసాద్, గురజాల శ్రీనివాసరావు, రవికుమార్, బొమ్మనబోయిన సాంబశివరావు, లలిత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# జూలై 9 న సమ్మెను జయప్రదం చేయండి

**సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపిన - ఆవాజ్ కమిటీ**

**బద్వేల్ జూలై 6 (ప్రజా జ్యోతి న్యూస్)** ఆదివారం నాడు స్థానిక పట్టణంలోని ఆవాజ్ కార్యాలయం నందు ఆవాజ్ కమిటీ సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు పి చాంద్ భాష ,బద్వేలు పట్టణ ఆవాజ్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ అబ్దుల్ సత్తార్, ఎస్ అన్వర్ భాషలు మాట్లాడుతూ జూలై 9వ తేదీన కార్మికుల హక్కుల కోసం దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నారన్నారు. ఈ సమ్మెకు ఆవాజ్ కమిటీ సంపూర్ణ మద్దతు తెలిపారు, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలన్నారు కార్మికులు ప్రాణ త్యాగాలతో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కాల రాస్తున్నారన్నారు, నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చి బడా కంపెనీల యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలను మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కార్మికుల శ్రమ దోపిడిని దోచుకు తినే విధంగా చట్టాలను మారుస్తున్నారన్నారు, ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసి దేశంలో ఉన్న ప్రభుత్వ ఆస్తులన్నీ అదాని ,అంబానీ లాంటి కుబేరులకు కట్టబెట్టాలని చూస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పనిగంటలు 12 గంటలకు



పెంచి రాష్ట్ర ప్రభుత్వం 10 గంటలు పెంచి కార్మికులకు జీతాలు పెంచకుండా శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు, కార్మికులు పోరాటాలు ఉద్యమాలు చేయకుండా కార్మికుల హక్కులను అనగదొక్కడానికి బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చారన్నారు, ఈ నాలుగు కోడ్ లను రద్దు చేయాలన్నారు కార్మికుల హక్కుల కోసం దేశవ్యాప్తంగా జూలై 9వ తేదీ జరుగు సమ్మెను కార్మికులు , కర్షకులు ,ప్రజాసంఘాల నాయకులు మేధావులు ,కళాకారులు, ప్రతి ఒక్కరూ సమ్మెలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఆవాజ్ నాయకులు రహీం ,కేబి రసూల్ ,అల్లా బకాష్ ,ఖాజా గౌస్, అబ్దుల్లా , హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలు అంటే బ్యాక్వర్డ్ క్యాస్ట్ కాదు...

**బీసీలు అంటే సామాజిక శక్తి...**
**తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి..**






**జూలై 6 తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** బీసీలలోని అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి జనాభా ప్రాతిపదికన నిధులను కేటాయిస్తూ అన్ని కులాల అభివృద్ధికి కృషి చేస్తున్నది ఒక్కతెలుగుదేశం పార్టీ నేనని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం తిరుపతి ఇందిరా మైదానంలో బీసీ ఆత్మగౌరవ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, బీసీ వెల్ఫేర్ మంత్రి సవిత, ఆరోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్ ఇతర ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ శాసనసభ్యులు, బిసి సంక్షేమ సంఘం ముఖ్య నాయకులు తో కలిసి తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీసీ కార్పొరేషన్ కు, అదే విధంగా బీసీ ఉప కులాల కార్పరేషన్లకు అధిక శాతం నిధులను కేటాయించి బీసీలను ఆర్థికంగా సామజికంగా పైకి తీసుకురావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని కొనియాడారు. బీసీల అంటే వెనకబడిన వారు కాదని బీసీలు అంటే సమాజాన్ని ముందుకు నడిపే వారని పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో భేటీ అయిన బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

**97.18 కోట్ల రూపాయల అభివృద్ధి ప్రణాళికలు సమర్పణ సీఎం నుండి హర్షానందం**



**బాపట్ల జులై 6 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ఆదివారం నాడు బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాసమైన ఉండవల్లిలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై ముఖ్యమంత్రి కి ఎమ్మెల్యే నరేంద్ర వర్మ విస్తృతంగా వివరించారు. గత ఏడాది కాలంలో బాపట్ల నియోజకవర్గంలోని కీలక రంగాల్లో తీసుకున్న చురుకైన చర్యలను, ప్రజల మద్దతుతో సాధించిన విజయాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు.భవిష్యత్తులో బాపట్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలనే దృష్టితో తయారైన,97.18 కోట్ల రూపాయల విలువైన విభాగాల వారీ అభివృద్ధి ప్రణాళికలు ముఖ్యమంత్రికి సమర్పించారు. రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ, విద్య, వైద్యం, యువజన సాధికారత, పట్టణ వృద్ధి వంటి రంగాలలో తక్షణ చర్యల అవసరముందని వివరించారు.ఈ ప్రతిపాదనలు చూసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన సానుకూల స్పందనను వ్యక్తం చేశారు. అభివృద్ధికి నిర్దేశించిన దారిలో బాపట్ల వేగంగా ముందుకు సాగుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఇటీవల %గా%4 కార్యక్రమంలో భాగంగా బాపట్ల పట్టణంలోని బెతని కాలనీలో నివసించే చిన్నారులు సందీప్, హేమశ్రీలను ఎమ్మెల్యే నరేంద్ర వర్మ దత్తత తీసుకున్న విషయాన్ని ప్రస్తావించారు. సామాజిక బాధ్యతను నిరూపించే విధంగా తీసుకున్న ఈ చర్యకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.విజన్‌తో ముందుకు సాగుతున్న బాపట్ల నియోజకవర్గ అభివృద్ధికి నరేంద్ర వర్మ అంకిత భావం, ప్రణాళికాత్మక దృక్పథం ముఖ్యమంత్రి మెప్పు పొందాయి. ప్రజలతో సన్నిహితంగా ఉండి వారి సమస్యలను ప్రభుత్వ స్థాయిలో లేవనెత్తుతూ, శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పథకాలను చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలియజేశారు.

# బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం ఘనంగా నిర్వహణ



**కాకినాడ జులై 6 ప్రజా జ్యోతి జిల్లాస్టాఫ్ రిపోర్టర్** తణుకు నియోజకవర్గంలో ఆదివారం బాబు షూరిటీ మోసం గారంటీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి తణుకు నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ మంత్రివర్యులు కారుమూరి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీ కృష్ణంరాజు గారు, పార్లమెంట్ సమన్వయకర్త గూడూరి ఉమాబాల గారు, ఏపీ ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెంద్ర వీరన్న ఇరగవరం జెడ్పీటీసీ సభ్యులు ఆంజనేయులు గారు, తణుకు టౌన్ టీడీపీ అధ్యక్షులు మరిశెట్టి శేషగిరి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మెహర్ ఉన్నిసా బేగం ఇరగవరం మండల అధ్యక్షులు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్ గారు, అత్తిలి మండల అధ్యక్షులు సత్యనారాయణ తణుకు రూరల్ మండల అధ్యక్షులు వెంకట రమణ (అబ్బులు) పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లేందుకు పార్టీ చేస్తున్న కృషిని వివరించారు. బాబు షూరిటీ నినాదంతో ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని, టీడీపీ పాలనలో మోసం జరగదనే సందేశం గ్రామస్థాయిలోకి తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి పార్టీ కట్టుబడి ఉందని నాయకులు పేర్కొన్నారు. కార్యకర్తలంతా సమిష్టిగా కృషి చేయాలని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమం సజావుగా సాగేందుకు స్థానిక నాయకులు, కార్యకర్తలు సమర్థవంతంగా ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గ రాజకీయ కార్యకలాపాల్లో ఈ కార్యక్రమం విశేషంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఎస్సీ కమిషన్ చైర్మన్ ను కలిసిన ఉమ్మడి జిల్లాల దళిత న్యాయవాదులు

**కొవ్వూరు/తాళ్లపూడి, జూలై6ప్రజా జ్యోతిన్యూస్** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సి కమిషన్ చైర్మన్, మాజీ మంత్రి వర్యులు కె.ఎస్ జవహర్ ని కొవ్వూరు పట్టణంలోని ఆయన కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిసి ఇటీవల ఆయన ఎస్సి కమిషన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ముందుగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి అనంతరం వారు ఎదుర్కొనే సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లి వారికి న్యాయం జరిగేలా కృషి చేయమని కోరిన ఉమ్మడి తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాల మాదిగ లాయర్స్ ఫెడరేషన్ అడ్వకేట్స్ కె. ప్రసాదరావు వి. గోపీనాథ్ , చిడిపి వీర్రాజు , కె. దయానంద్ రాజ్ , జి. చిట్టిరాజు , కె. ఉదయ్ కుమార్ , పి. రత్న శేఖర్ , ఎమ్. గోపి , కె. ప్రసాద్ , తిగిరిపల్లి రవి , పి. బల రాముడు , కె. సతీష్ గారు మరియు ముఖ్య న్యాయవాదులు తదితరులు



# బద్వేల్ లో ఏ. పి. ఎన్. జి. ఓ. సంఘం ఎన్నికలు ఏక గ్రీవం

**అధ్యక్షులు గా టి. నరసింహా రెడ్డి**
**కార్యదర్శి గా వి. శివరామి రెడ్డి**



**బద్వేల్ జూలై 6 (ప్రజా జ్యోతి న్యూస్)** ఆదివారం నాడు బద్వేల్ తాలూకా యూనిట్ ఎన్నికలకు జిల్లా నుండి ఎన్నికల అధికారిగా నిత్య పూజయ్య, సహాయ ఎన్నికల అధికారిగా నరసింహా రెడ్డి, పరిశీలకులుగా, డి. రవికుమార్, హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా, జిల్లా అధ్యక్షులు,బి. శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, వై. ప్రసాద్ యాదవ్, పాల్గొన్నారు, ఎన్నికల అధికారి 16 స్థానాలకు ఒక్కక్క నామినేషన్ వేయడంతో పోటీ లేకుండా ఎన్నికల అధికారి 16 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు, అధ్యక్షులు గా టి. నరసింహా రెడ్డి సహాధ్యక్షులుగా ఎస్. వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా, ఎం. శ్రీనివాస రెడ్డి, బి. మల్లిఖార్జున రావు, బి. యంగయ్య, కె. బాలుడు, కె. వెంకటమ్మ, హరికృష్ణ, జాయింట్ సెక్రెటరీస్ గా టి ఎన్ వి కృష్ణ శర్మ, సి. బ్రహ్మానంద రెడ్డి, పి. మధుసూదన్ రెడ్డి, కె. నారాయణ, ఎన్. లక్ష్మి నరసమ్మ, ఎస్.కె, కరీమున్, ఆర్గనైజయింగ్ సెక్రటరీ, వి.వెంకటేశ్వర్లు, కోశాధికారి, రమణయ్య, డి. ఈ. సి. మెంబెర్, కె. చిరంజీవి, ఎన్నికైనట్టు ప్రకటించారు,ఈ కార్యవర్గం 3 సంవత్సరాలు కొనసాగుతుందని, నూతన కార్యవర్గానికి జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి, డి. రవికుమార్ శుభాకాంక్షలు తెలియ చేశారు. జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు మాట్లాడుతూ, డి. ఏ.పి. ఆర్. సి, త్వరలో వస్తాయని తెలియ చేశారు, ఈ

## హెల్మెట్ ధరించండి సురక్షితంగా గమ్యస్థానాన్ని చేరుకోండి.

**ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా అన్ని పత్రాలు కలిగి ఉండాలి.**
**ట్రాఫిక్ ఎస్సై నరేష్**



**నందిగామ, జులై 06 (ప్రజాజ్యోతి)** రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి సహకరించాలని ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ తెలిపారు. ఆదివారం నందిగామ శివారు అండర్ పాస్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు తలకుబలమైన గాయం తగిలి మృతి చెందుతున్న నేపథ్యంలో హెల్మెట్ ప్రయాణం సురక్షితమైన ప్రయాణమని ఆయన అన్నారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ వాహన అనుమతి పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని, ముగ్గురు వ్యక్తులు ఒకే వాహనంపై ప్రయాణం చేయొద్దని నియమ నిబంధనలు పాటించని వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ శ్రీనివాసరావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## అత్యంత భక్తిశ్రద్ధలతో పీర్ల చావిడిలో పీర్ల పండగ

**పీర్ల చావిడి లో భారీ అన్నదానం**
**కుల మతాలకతీతంగా భక్తులు హాజరు**







**నందిగామ, జులై 06 (ప్రజాజ్యోతి)** నందిగామ భారత్ టాకీస్ రోడ్ లో గల పీర్ల చావిడిలో పీర్ల పండుగ అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ పీర్ల పండుగ వేడుకకు భక్తులు కులమతాలకతీతంగా హాజరై పీర్లను తిలకించారు. మున్సిపల్ చైర్మన్ కృష్ణకుమారి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన త్యాగానికి గుర్తుగా జరుపుకునే పండుగ మొహర్రం మంచితనానికి, త్యాగానికి మొహర్రం ప్రతీక ముస్లిం సోదర, సోదరిమణులందరికి మొహరం శుభాకాంక్షలు తెలిపారు .అనంతరం పీర్ల ఉగ్రం వచ్చిన వ్యక్తులు పీర్లను పట్టుకుని అగ్నిగుండంలో ఎగురుతూ పీర్లలో ఉన్న నిష్టను చూపారు.ఈ వేడుకను తిలకించడానికి నందిగామ పట్టణ భక్తులు తరలి వచ్చారు. గత నెల 27 ప్రారంభమైన ఈ వేడుక నేటి సోమవారంతో ముగియనుంది. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.రేపు సోమవారం మధ్యాహ్నం పీర్ల చౌడి లో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.సమీర్, అబ్బాస్ అలీ,జమీర్,నాగుల్ మీరా, మరియు మూడో వార్డు యువకులు కార్యక్రమాన్ని దగ్గరుండి నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి 2000 మంది భక్తులుకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కృష్ణకుమారి, రాష్ట్ర లీగల్ సెల్ దేశం పార్టీ కార్యదర్శి షేక్ కరీముల్లా,పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రాము,కాసర్ల లక్ష్మీనారాయణ పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఇమామ్ జానీ, మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పితాన్ మేస్త్రి, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం:

**బిజెపి నాయకులు**



**గుంతకల్లు జులై 6 (ప్రజా జ్యోతి):** కేంద్ర మాజీ మంత్రి జన సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని గుంతకల్లు భారతీయ జనతా పార్టీ నాయకులు అన్నారు. భారతీయ జనతా పార్టీ గుంతకల్లు పట్టణ శాఖ ఆధ్వర్యంలో శామప్రకాష్ ముఖర్జీ జయంతి సందర్భంగా బిజెపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జనసంఘ్ స్థాపించి ప్రజల కోసం పోరాడారని,ఒకే దేశం, ఒకే చట్టం, ఒకే ఎన్నిక ఉండాలని ఆనాడే శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆలోచన చేశారని, ఆయన ఆశయ సాధన కోసం పార్టీ శ్రేణులు అందరూ పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర మహిళ నాయకురాలు వన గొంది.విజయలక్ష్మి, బిజెపి నాయకులు గుర్రం సూర్యనారాయణ, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కొలిమి రామాంజనేయులు, బిజెపి పట్టణ అధ్యక్షులు వడ్డే రమేష్, బిజెపి నాయకులు రామాంజ నేయులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన

**ఎమ్మెల్యే కూన రవికుమార్**
**ఆమదాలవలసలో సందడిగా తొలి అడుగు కార్యక్రమం**



**ఆమదాలవలస , ప్రజా జ్యోతి న్యూస్:** రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి,ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పారదర్శక పాలన సాగిస్తోందని ఆముదాలవలస శాసన సభ్యులు ,రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవి కుమార్ అన్నారు. కూటమి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఆముదాలవలస మున్సిపాలిటీ వెంగలరావు కాలనీ లో ఘనంగా నిర్వచించిన సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనలోనే ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. విజన్ ఉన్న నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి అయితే రాష్ట్ర ప్రగతి ఏ విధంగా ఉంటుందో నేడు ఆంధ్ర రాష్ట్రాన్ని చూస్తే అర్థమవుతుంది అన్నారు. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమాన్ని అందిస్తున్న నాయకుడు చంద్రబాబు అని కొనియాడారు. ప్రతి పేదవాడి కళ్లల్లో ఆనందం చూడడం కోసమే కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ముఖ్య నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, సీనియర్ నాయకులు మొదలవలస రమేష్ , పట్టణ అధ్యక్షులు సంపతి రావు మురళి , మరియు వార్డ్ ఇంచార్జ రెడ్డి రాంబాబు , టీడీపీ నాయకులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు యువత ,మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

